వెలుగు నీడలు

"మీ నాన్నని వాకిట్లో అరుగుమీద పడుకోమని చెప్పండి. ఇదుగో ఈ చాపా, దిండూ కూడా యిచ్చిరండి" అంది సరళ.

ఈ మాటలు వినేసరికి శ్రీధరకి కొరడాతో చురుక్కున చరిచినట్లనిపించింది. భార్యమాటలు తండ్రికి ఎక్కడ వినపడతయ్యో అని, బదులుచెప్పకుండా, చాపా, దిండూ చేతపుచ్చుకుని మెట్లుదిగిపోయాడు. భార్యమాటలు ఒకవేళ తండ్రికి వినబడితే? తను ఏముఖంతో తండ్రికి ఎదురుపడతాడు? ఇంత ఇల్లూ, ఇన్ని గదులూ, ఇన్ని మంచాలూ, ఇన్ని పరుపులూ వుంటే తన తండ్రిని వాకిట్లో అరుగుమీద తుంగచాప పరుచుకుని పడుకోమని చెప్పటానికి నోరెల్లా వస్తుంది? సరళని తను పెళ్ళాడి నాలుగేళ్ళు దాటింది. ఈ నాలుగేళ్ళలో తండ్రి తనయింటికి రావటం యిదే మొదటిసారి. మొదటిసారే సరళ మామగారిని ఈవిధంగా సత్కారింపదలిచింది. తలుచుకోగానే శ్రీధర ఆపాదమస్తకమూ కంపించిపోయాడు. తన ఇంటికి రాక రాక వచ్చిన తండ్రిని పరదేశిలాగా వీధివాకిట్లో పడుకోమని ఏముఖం పెట్టుకుని చెబుతాడు? ఈ సత్కారాన్ని చూసి తండ్రిమనసు ఎంత నొచ్చుకుంటుందో? పోనీ, ఎవరైనా నౌకరు చేతికిచ్చి చాపా, దిండూ పంపితే? అప్పుడు తండ్రికి తనమీద మరీకోపం రావచ్చు. ఆయనమనసు మరింత కష్టపడవచ్చు. పెళ్ళిలో తనకు జరిగిన

అగౌరవాన్ని మనసులో పెట్టుకుని ఇంత కాలమూ కొడుకు యింటి గడప తొక్కలేదు. అంత అభిమానం గల మనిషి. అటువంటి మనిషి యీనాటికి చుట్టపుచూపుగా యింటికివస్తే ఇంట్లో చోటులేనట్టు వీధివాకిట్లో పడుకోమని పురమాయించటమా? ఇంతమాత్రం తెలుసుకోలేక పోయిందా సరళ? తెలిసి చేయాలనే చేసింది. ఆవిధంగా పురమాయించటంలో తన వంశం మీదా, తనవారిమీదా ఆమెకున్న నిరాదరణని వెల్లడించింది. అతని గతజీవితమంతటినీ ఆమె అగౌరవించింది. ఆమాటల్లో వున్న అనాదరం శ్రీధరగుండెల్లో పరాభవజ్వాలల్ని రగిలించింది.

ఒక్కొక్కమెట్టూ దిగుతుంటే ఏదో పాతాళంలోకి దిక్కు తెలియని చీకటిలోకి అణగారిపోతున్నట్లనిపించింది. మోయలేని బరువుతో కుంగిపోతోంది శ్రీధరమనసు. తీరా దిగి కిందికి వచ్చేసరికి తండ్రి కనబడలేదు. 'నాన్నా' అని పిలిచాడు. మారులేదు. చుట్టుపక్కలంతా కలయజూశాడు. జాడలేదు. సరళమాటలు ఆయనకి వినబడినవ్యేమో? వినటంతోనే అభిమానంవచ్చి వెళ్లిపోయాడేమో? ఎన్నడూ గడప తొక్కనిమనిషి యింటికివస్తే చేయవలసిన సత్కారమిదేనా? పోనీ, సరళికి మర్యాదచేయటం తెలియదా? తెలియకేం? మొన్న వాళ్ళ మేనమామవస్తే ఎన్ని ఉపచారాలు చేసింది! ఎంత రాజభోగంతో ఆయన్ని గౌరవించింది! ఏ అతిథి వచ్చినా ఎంతో ఆదరిస్తుంది. అటువంటి సరళ తన తండ్రిని ఈవిధంగా చూడటం దేనికి?

కారణం శ్రీధరకి వెంటనే స్ఫురించింది. శ్రీధర అంత రాళంలో బడబాగ్నిజ్వాలలు భగభగ రగిలినయ్. అవును, అందుకే. అదేకారణం. అవును, ఆవిషయం ఎన్నోసార్లు సూటీ పోటీ మాటలతో చెప్పనేచెప్పింది. ద్వేషాన్ని ఆమెఎన్నడూ దాచలేదు. తన మాటలవల్ల భర్తగుండెల్లో ఎటువంటి మంట అంటుకున్నా, ఎటువంటి తుపాను చెలరేగినా ఆమెకి భయం లేదు. ఈ విషయంలో భర్తమనసుని గాయపరచటంవల్ల సర ళకి ఆనందంకూడా కలగవచ్చు.

లేకపోతే సరళ ఇంత బహిరంగంగా ఎందుకు నిరాదర ణని వెల్లడించాలి? అక్కడికికాని ఆమెకి తృప్తి కలగదు కాబోలు. అక్కడే చతికిలపడిపోయాడు శ్రీధర. తండ్రికోసం ఎదురు చూసిచూసి నిరాశచేందాడు. ఆయన వెళ్లిపోయా డేమో ననుకున్నాడు. ఎక్కడికయినా వెళ్ళి పొద్దుపోయి వస్తాడేమోనని ఇందాకటినుంచీ కూచున్నాడు. అక్కడే చాపవేసుకుని శ్రీధర మేనువాల్చాడు. ఇంత పరాభవంతో, యింటికి వచ్చినతండ్రి తిరిగి వెళ్ళిపోయాడనే వ్యథ అతన్ని కాల్చివేసింది. కళ్ళు భగ్గుమంటున్నయ్. పసిపిల్లవాడిలాగా ఒక్కసారి గొంతెత్తి 'నాన్నా' అని ఏడిస్తేకాని ఈ బాధ చల్లారదేమో ననిపించింది. ఎందుకో కన్నీళ్ళు చిందినయ్. ఇన్నాళ్ళకి తల్లి జ్ఞాపకంవచ్చింది. చిన్నప్పుడు తను పెరిగిన పల్లె కళ్ళకుకట్టింది. తమ్ముళ్ళూ, చెల్లెళ్ళూ అంతా కళ్ళల్లో గంతులువేశారు. ఒక్కసారిగా గతజీవితంలోకి రెక్కలుకట్టు కుని ఎగిరిపోవాలని అతని మనసు తహతహలాడింది. 'నాన్నా,' అన్న పిలుపు గొంతుకలో కొట్టుకుంటోంది. తను చిన్నప్పుడు

జెండా లెగరేసిన పూరిగుడిసే, తను కోతికొమ్మచ్చులాడిన పున్నాగచెట్లూ, అన్నీ గొంతెత్తి శ్రీధరని పిలుస్తున్నట్లనిపించింది. ఆనాటి జీవనం వదిలించుకోలేని బంధాలు వేసి శ్రీధరని గుంజుతోంది.

అక్కడే దిండుమీద తలవాల్చి కళ్ళు మూశాడు శ్రీధర. నౌకరువచ్చి 'బాబుగారూ' అని పిలచాడు. శ్రీధర కళ్ళు తెరిచాడు. "బాబుగారూ, నాన్నగారు ఇంటికి వెళ్ళిపోయారు. మీతో చెప్పమన్నారు—" అన్నాడు నౌకరు.

"ఎప్పుడూ? నీతో ఇంకేమయినా చెప్పారా?"

"లేదు బాబూ, మీతో ఏమైనా మాట్లాడదా మనుకున్నారేమో, మేడమెట్లెక్కారు. మధ్యలోనే కిందికి దిగి వచ్చేశారు. నన్నుచూసి మా అబ్బాయితో నేను వెళ్ళానని చెప్పమన్నారు."

ఈమాటలు వినేసరికి శ్రీధర ప్రాణాలు ఎగిరిపోయినయ్. ఇంకేముంది? తండ్రిసరళమాటలు విన్నట్లే—అందుకే క్షణమైనా వుండకుండా వెళ్ళిపోయాడు. ఆమాటలకి ఆయన ఎంత నొచ్చుకున్నాడో? ఆయునమనను ఎంత చిన్నబుచ్చుకున్నదో ... ఆ బాధని కనబడకుండా దాచుకోటానికి "ఇంకేమీ చెప్పలేదా నీతో?" అని అడిగాడు నౌకర్ని. వాడు లేదని చెప్పి వెళ్ళిపోయాడు. అక్కడే కూలపడిపోయాడు శ్రీధర.

మేడమీదినుంచి కేకపెట్టింది సరళ. "ఇదిగో, మిమ్మల్నే, పాప లేచి ఏడుస్తోంది మీకోసం." ఆరాత్రంతా అక్కడే జాగారం చెయ్యాలనుకున్నాడు. కాని సరళ పిలుపు వినబడగానే అతని సంకల్పం సడలిపోయింది. ఇందాకటినుంచీ తాను విహరించిన లోకంనుంచి బలవంతాన మరొకలోకానికి గుంజుకుపోతున్నట్లనిపించింది. అక్కడ శ్రీధరని కాళ్ళూ చేతులూ కట్టేసి బందీనిచేస్తారు. ఆ బందిఖానా తాళంచెవులు సరళచేతుల్లోనే వున్నయ్. కాని ఆబందిఖానాలోకి పోకుండా వుండలేడు శ్రీధర. అదే అతనిస్వభావంలో వున్నలోపం. ఎంతో ఎదురుతిరగాలనుకుంటాడు; సరళని కాదని దూరంగా పారిపోవాలనుకుంటాడు. కాని తీరా జరిగేదేమంటే- శ్రీధర లొంగిపోవటం, సరళ విజయంతో పొంగిపోవటం?

అయినా ఆ రాత్రిమటుకు శ్రీధరకి ఎక్కడలేని ధైర్యమూ వచ్చింది. సరళ హేళనలనీ, వెక్కిరింపులనీ సహించే ఓపికలేదు. ఈసంగతి సరళ గ్రహించలేదు. ప్రపంచంలో నోరులేకుండా అన్నిటినీ భరించేవారుంటారు. కాని వారి సహనానికి కూడ ఒక హద్దువుంది. ఒక మితివుంది. ఆ మితి మీరినప్పుడు వారి సహనంలోంచి అసహనం అగ్నిపర్వతం లాగా బద్దలవుతుంది.

"అప్పుడే వచ్చారేం, పాపం? ఇంకాస్సేపు తండ్రీ కొడుకులు చెవులు కొరుక్కోకపోయారూ? ఆయనతో ఏం మంతనాలు చేస్తున్నారు? వాటికొక అంతూపొంతూ లేదూ?" అని సరళ రుసరుసలాడుతూ, ఏడుస్తున్న పాపని రెక్కలు

పుచ్చుకుని తెచ్చి శ్రీధరమంచంమీద కూలవేసింది. "అదుగో నమ్మా, వచ్చారు మీనాన్న, పాపం, బెంగపడిపోతావు నిమిషం కనిపించకపోతే!" అంటూ నాలుగేళ్ళ ఆశని శ్రీధర పక్కలో పడేసింది. శ్రీధర సరళ కేసి చూడకుండానే ఆశని ఒళ్ళోకి తీసుకొని జోకొట్టాడు. ఇందాకటినుంచీ వెక్కి వెక్కి ఏడ్చినఆశ ఒక్కనిమిషంలోనే కొట్టినట్లు నిద్రపోయింది. కొంచెంసేపు ఊరుకుని సరళ మళ్ళీ అందుకుంది. "ఏం రహస్యాలు మాట్లాడారు, తండ్రితో? చెప్పకూడదా?" అప్రయత్నంగా అన్నాడు—"అవసరంలేదు. చెప్పవలసిన అవసరం లేదు." భర్త ఇటువంటి సమాధానం చెబుతాడని సరళ అనుకోలేదు. వినగానే క్షణంసేపు విస్తుపోయింది. ఒక్క మాటయినా తనమీద ఉంచుకోటం సరళ స్వభావానికే విరుద్ధం. దెబ్బకి దెబ్బ కొడితేనేకాని సరళకి శాంతివుండదు. కోపంతో మండిపడుతూ అడిగింది—"ఏం? ఎందు కవసరం లేదు? ఈఇంట్లో నాకు తెలియకుండా ఏదీ జరగటానికివీలేదు. చెప్పండి, ఏంమంతనాలు జరిపివచ్చారో" గడపలోకి వచ్చిన తండ్రిని అగౌరవపరచటంతోటి సరళకి తృప్తిలేదుకాబోలు. "నీ అమర్యాదని సహించి ఇక్కడ ఆయన క్షణమైనా వుండ లేదు. వెంటనే వెళ్లిపోయారు. ఇంటికి వచ్చిన అతిధిని బైటికి పంపేశావు"అని సూటిగా సరళకి చెప్పివెయ్యాలనుకున్నాడు. చెప్పివేసేదాకా అతనిలోపలి మంట చల్లారదు. కాని అంత టితో ఊరుకోక సరళ తనముందరే తన తండ్రిని ఇంకా చుల కనచేసి మాట్లాడుతుందేమో? అది తాను సహించగలడా? సహించక తాను చెయ్యగలదేముంది? అయినా తానుబదులు

చెప్పకుండా వూరుకుంటే సరళ అంతటితో ఆ ప్రసంగాన్ని కట్టిపెట్టి నిద్రపోతుంది. అందుకనే శ్రీధర మారుపలకకుండా మంచంమీదవాలి ఆళని జోలకొడుతూ కళ్లుమూశాడు. సరళ లోపల రగిలిపోతోంది. భర్త ఇంత పెంకెగా, తన మాటకి మారుచెప్పకుండా, తనని చులకనచేసి నిద్రపోవటం ఆమె సహించలేకపోయింది ఎన్నడూ తనమాటకి ఎదురాడి ఎరగడు భర్త. తను గీసినగిరిలోనుంచి కదిలిఎరగడు. అటువంటి మనిషి ఇవాళ ఎందుకింత గర్వంగా మాట్లాడాలి? "నీకు చెప్పాల్సిన అవసరంలేదు." అని తనముఖాన అనివేశాడు- ఇంత తెగువ ఎక్కడినుంచి వచ్చింది? తన భర్తకి అతని తండ్రి ఏదో ఎక్కాలు పెట్టివుంటాడు. లేకపోతే ఇంత నిర్లక్ష్యంగా శ్రీధర ఎన్నడయినా తనతో ప్రవర్తించాడా? తలుచుకున్నకొద్దీ సరళకి లోపల రగిలిపోతోంది. అభిమానంతో ఎంతసేపటికీ కంటిమీద కునుకు రాలేదు.

కళ్ళు మూసుకున్నాడేకాని శ్రీధరకీ నిద్రపట్టలేదు' అతని హృదయం సరళని సూటిగా ఒక్కప్రశ్న అడగదలుచుకుంది. సరళమాటలవల్ల తను పొందిన బాధనంతనీ ఆ ప్రశ్నలో నింపుతుంది. కాని సూటిగా అడగగలనా? అని అతని మనస్సే తటపటాయిస్తోంది. "వద్దు అడగను. ఇన్నాళ్ళనుంచీ సహించలేడా? ఇల్లాగే కాలం వెళ్ళదీయటం కష్టమా?" అనుకుంటాడు. మరుక్షణంలోనే "అడుగుతాను. ఏమయినా సరే, అడిగివేస్తాను. సరళా, ఎవరిచ్చారు నీకీఅధికారం అనిసూటిగా అనేస్తాను. ఏం బదులుచెబుతుందో వింటాను. తరువాత ఏం

చెయ్యాలో ఆలోచిస్తాను" అనుకుంటాడు. మనసులో మల్లా గుల్లాలు పడుతూ తెల్లవారుస్తాడుకాని తెగించి అడగలేడు. నెలకు రెండువేల జీతం సంపాదించే మామగారు, ప్లీడరు బోర్డు కట్టి చిల్లిగవ్వ సంపాదించలేకపోతున్న తనూ, తనతో సమానంగా కాలేజీలో చదివిన తన భార్య సరళా తలపుకు వచ్చేసరికి అతని నోరు నొక్కుకుపోతుంది. తనని చదివించలేక తల్లితండ్రులు ఏనాడయితే ఈ రెండువేల జీతగానికి అల్లుడిని చేశారో ఆనాడే తన నోరు కట్టుబడిపోయింది కాబోలు. ఆనాడే అతనిస్వేచ్ఛ అంత మొందింది కాబోలు. అప్పటినుంచీ వేరొకరికి చెప్పుకోలేని మూగబాధ ఒక్కటే అతనికిమిగిలింది కాబోలు. తన అసహాయతని తలుచుకోగానే అతని మనసు చివుక్కు మంటుంది. ఈ బతుకిలా తెల్లవారవలసిందే నని నిస్పృహతోస్తుంది. ఒక్కొక్క సమయంలో అతనికి తల్లిదండ్రులమీద మితిలేనికోపం వస్తుంది. "తనూ అందరిలానే బతకలేకపోయేవాడా? మిగిలిన ముగ్గురు తమ్ముళ్ళతోపాటూ తనూ పెరిగేవాడుకదా? బిచ్చమెత్తుకుని అయినా స్వేచ్ఛగా బతికేవాణ్ణికాదూ? నన్ను ఈ ఇంట్లో ఎందుకు తెచ్చిపడేశారు. ఎందుకు నాకాళ్ళూ చేతులూ విరిచికట్టేశారు?" అని తలిదండ్రులమీద అతని మనసు దండోరా చేస్తుంది. చివరికి "వారేం తప్పుచేశారూ?" అని వాళ్ళని క్షమిస్తాడు. "నాకు ఇంట్లో ధనంతోపాటు సుఖం దొరుకుతుందనుకున్నారు. నన్నుగురించి తాము ఇక దిగులుపడ నక్కర్లేదనుకున్నారు. దారిద్ర్యపు యాతనలో నా బరువు తప్పించుకోవా లనుకున్నారు, వారిదేం తప్పుంది?" అనుకుంటాడు.

నిద్రపోతున్న ఆశ అటూ ఇటూ కదిలింది. "తాతయ్య అరిటిపల్లు పత్తాడు" అని కలవరించింది. వెంటనే శ్రీధరకి గుర్తుకివచ్చింది. తన తండ్రి మనమరాలిచేతుల్లో అరటిపళ్లు పెట్టాడు. తనముందే సరళ వాటిని "జబ్బుచేస్తయ్యమ్మా, ఆశా. తినద్దు." అని వారించి దాసీదాని కిప్పించివేసింది. తన తండ్రి తెచ్చిన పేదకానుకని తన భార్య ఈవిధంగా చులకన చేయటం తలుచుకోగానే శ్రీధరకడుపులో దేవినట్లయింది. అప్రయత్నంగా తనకి చిన్నప్పుడు తల్లి చెప్పిన కుచేలుడి అటుకులకథ గుర్తుకువచ్చింది. వెంటనే అతనికి తెలియకుండానే లోపలినుంచి "అమ్మా" అని ఆక్రోశం వెలువడింది. ఆశని దగ్గరికి తీసుకుని జోలకొడుతున్నాడు.

ఆశ కలవరింత వినగానే సరళ తనని సంబాళించుకోలేకపోయింది. లేచికూచుంది. మొన్న తనతండ్రి పట్నంనుంచి వస్తూ మనమరాలికి ఎన్నోపళ్ళూ, చొక్కాలూ, ఆటవస్తువులూ తెచ్చాడు. ఆమధ్య తన తమ్ముడు కలకత్తానుంచి మేనకోడలికోసం రకరకాలబొమ్మలు తెచ్చిపెట్టాడు. వాటిని గురించి ఆశ ఎన్నడయినా కలవరించిందా? అటువంటిది పల్లెటూరినుంచి పేద తాతగారు తెచ్చిన ముష్టి అరిటిపళ్ళకోసం కలవరించటం వినగానే సరళకి కోపంవచ్చింది! తన ఇంట్లో తనకి విరోధిశక్తులేవో దూరి చాటుగా పనిచేస్తున్నయ్. అవి ఒకనాడు తన కాపురాన్నే తారుమారు చేసివెయ్యవుగదా?

"ఇదుగో, మిమ్మల్నే. నిద్రా?" అని సరళ భర్తని పిలిచింది. అప్పటికి కలతనిద్రలో వున్న శ్రీధరకి ఈ పిలుపు

వినబడలేదు. వినబడికూడా పలకలేదేమో ననుకుని సరళ కోపంతో పక్కమీద వాలి బలవంతాన నిద్రతెచ్చుకోవాలని కళ్ళుమూసింది.

కాని సరళకి నిద్రపట్టలేదు. కలతనిద్రతోనే తెల్లవారింది. ఎందుకో సరళ మనసులో ఆందోళన బైలుదేరింది. తన పెళ్ళి అయినదగ్గరనుంచీ ఈనాటివరకూ తనుపడిన శ్రమఅంతా నిష్ఫలమయిపోతుందేమో! ఇన్నాళ్ళనుంచీసరళ ఒక ప్రయత్నంలో మునిగివుంది. తనభర్తబీదవారిబిడ్డ. తాను ధనికులబిడ్డ. తమఇద్దరికి పెళ్ళిజరిగింది. అప్పుడు అంతా 'ఇదేమిసంబంధం' అన్నారు. 'ఈ పౌరోహిత్యపు సంబంధమెక్కడదొరికింది? నిక్షేపంలాంటిపిల్ల! బి. యే. దాకా చదువుకున్న సరళకి ఇంతకంటే మంచిసంబంధమే దొరకలేదా?' అని ఆక్షేపించారు. కాని వరులకోసం వెదకివేసారిన సరళ తండ్రికి శ్రీధరకంటే మంచివరుణ్ని తేవటం తలకుమించిన పని అనిపించింది. ఆయన శ్రీధర పేదరికాన్ని సరుకుచెయ్యక పెళ్ళి అయిన దగ్గరనుంచీ అల్లుణ్ని తెచ్చి తనఇంట్లోనే వుంచుకున్నాడు. పెళ్ళిలో బంధువులు చేసిన హేళనలూ, ఆక్షేపణలూ సరళ విన్నది. అప్పటినుంచీ సరళ ఒకవిధానాన్నే అనుసరిస్తూ వచ్చింది. శ్రీధర బీదఇంటిబిడ్డ అనే సంగతి తను మరిచిపోయింది. లోకాన్ని ఆ విషయం మరిచిపోయేటట్లు చేయాలి. శ్రీధరనికూడా ఈవిషయం మరిచేట్లుచేయాలి. అతని గతజీవితాన్ని మరిపించాలి. మునుపటిచోటునుంచి వేళ్ళతో పెళ్ళగించివేయాలి. అతని తల్లిదండ్రులతోనూ, అక్కచెల్లెళ్ళతోనూ, బంధువులతోనూ ఏమీ సంబంధం వుండకుండా

చెయ్యాలి. అప్పటికిగాని శ్రీధర కొత్త పరిసరాలలో పాతు కోడు. అప్పటికిగాని సరళభర్త కాదగిన హోదా అతనికి రాదు. అప్పటికిగాని పెళ్ళిలో బంధువులు హేళనచేసినప్పుడు తన మనసులో రగిలినమంట చల్లారదు. ఈవిషయంలో సరళ విజయానికి ఇంకోవిషయంకూడా తోడ్పడింది. పెళ్ళిలో శ్రీధర తల్లిదండ్రులకీ, బంధువులకీ తలవంపు కలిగింది. సరళ తండ్రి గారి రెండువేలజీతంతో వియ్యంపొందటానికి శ్రీధర తండ్రి సమఉజ్జీ కాడని పెళ్ళికివచ్చినవారు ప్రతి అంశంలోనూ వెల్ల డించారు. శ్రీధర తండ్రికి డబ్బు లేకపోవచ్చు. కానిఅభిమానం మాత్రం జాస్తి. అందుకనే శ్రీధర తరఫు బంధువు లెవ్వరూ ఇంతవరకూ సరళగడప తొక్కలేదు. కాని ఇప్పుడు సరళ కెందుకోభయం...తనపట్లు తప్పిపోతే? తన శ్రీధర తనఆశా, తనచెయ్యి జారిపోతే ఊహూ, జరగదు. అల్లా ఎన్నటికీ జరగనివ్వదు...కాని...

*　　*　　*　　*　　*

కొన్నాళ్ళకి టపాలో శ్రీధరకి ఉత్తరంవచ్చింది. ఇన్నా ళ్ళకి తండ్రి తనకు ఉత్తరం రాసినందుకు శ్రీధర పొంగి పోయాడు. కవరు చింపుతుంటే సంతోషంతో అతనిచెయ్యి వణికిపోయింది. చింపి చదువుతుంటే అతనికే తెలియకుండా కళ్ళలో నీరుతిరిగింది. నిజానికి ఆ వుత్తరంలో విచారపడవల సిన సంగతేలేదు. పైగా సంతోషపడవలసిన విషయం. అందులో తండ్రి రాసిందేమంటే: శ్రీధర తమ్ముడిపెళ్లి నిశ్చయమయింది. "మీ అమ్మ పోయినతరువాత మన యింట్లో ఇదే మొదటి శుభకార్యం. నువ్వూ, కోడలూ తప్ప

కుండా రావాలి. ఇది మీచేతులమీదుగానే జరగాలి. ఇది చెప్పాలనే మొన్న వచ్చాను. కాని తొందరపనిమీద వెంటనే ఇంటికి వెళ్లిపోయాను.” అని తనని మరీమరీ రమ్మనిరాశాడు. తన మనసు నొచ్చుకుంటుందని తండ్రి పనిమీద వెళ్లిపోయానని అబద్ధమాడుతున్నాడు. పిలవాలని తను మేడమెట్లెక్కిన సంగతీ, తన కోడలిమాటలువిని వెంటనే దిగి వెళ్లిపోయిన సంగతీ దాచివేస్తున్నాడు. ఆ విషయం శ్రీధరకి తెలియదని ఆయన ఊహించివుండవచ్చు. కాని విషయమంతా తెలిసిన శ్రీధరతండ్రి ఉత్తరానికి తట్టుకోలేకపోయాడు. తండ్రి ఎంత బాధపడ్డాడో? అభిమానంతో ఎంత కుమిలిపోయాడో? దీనికంతకీ తనేకదా కారణం? అవును, నువ్వే నువ్వే అంటోంది అతని మనస్సు. నీ తండ్రిని నీకళ్ళముందు సరళ అవమానిస్తుంటే నువ్వుచూస్తూ నిలబడ్డావు. ఇదివరకెన్నిసార్లో ఆమె నీతల్లిదండ్రులనీ, నీ గతజీవితాన్నీ చులకనచేసి హేళన చేసినప్పుడు సహించి వూరుకున్నావు. నీ పెళ్లి జరిగిన వేసవిలో నీతల్లి చనిపోయిందని మీరందరూ నీలగిరిలో వున్నప్పుడు కబురు తెలిసింది. అప్పుడు నిన్ను ఇంటికి పోనివ్వకుండా, తను రాకుండా సరళ అడ్డుపెట్టినప్పుడు నువ్వు చేతకానివాడివై చూస్తూ వూరుకున్నావు. ఇప్పుడుమాత్రం నువ్వేంచేస్తావు? ఏం చెయ్యదలిచావు? ఏంచెయ్యగలవు? అంటూ అతనిమనస్సే అతన్ని పొడుస్తోంది.

ఏమయినాసరే. సరళ వెంటవచ్చినా రాకపోయినా వెళ్ళితీరాలిసిందే. తనచుట్టూ పన్నిన ఈవలని పటపట తెంపి

బైటపడాలిసిందే. "ఆతరవాత ఏంజరుగుతుందో ఆలోచించు తున్నావా?" అని అతనిలోని పిరికితనం హెచ్చరించింది. "ఏం జరగాలో అది జరుగుతుంది. నేనుమాత్రం వెళ్లి తీరాలిసిందే" అనుకుంటూ గదిలోకి వెళ్ళాడు.

"ఎక్కడినుంచి వుత్తరం?"

"మానాన్న రాశాడు."

"ఏమని?"

చెప్పటమూ చెప్పకపోవటమూ అని శ్రీధర క్షణంసేపు సందిగ్ధంలో పడ్డాడు. ఈసారికూడా సరళ తనవారిని తన ముందు చులకనచేస్తుందేమో? అప్పుడు తను ఇదివరకులాగా సహించి వూరుకోవటమేనా? చివరికి "మాతమ్ముడి పెళ్లిట. మనిద్దరినీ తప్పక రమ్మని రాశారు" అని క్లుప్తంగా చెప్పాడు. కొంచెంసేపు వూరుకొని సరళ అడిగింది- "అయితే మొన్న ఆయన వచ్చినప్పు డెందుకు చెప్పలేదు?" అని. వెంటనే సరళకి చురుక్కున తాకేట్లుగా "దానికి నువ్వే కారణం." అనేశాడు శ్రీధర.

నివ్వెరబోయింది సరళ. "నేనా? ఆమాట ఆయన రాశారా? ఏదీ?" అని శ్రీధర చేతిలోంచి వుత్తరం తీసుకుని ఒక్క గుక్కలో చదివేసి, నిర్లక్ష్యంగా గిరాటువేసింది. ఇది చూచేసరికి శ్రీధర పట్టలేక పోయాడు. సరళ తన సర్వస్వాన్ని పరిభవించినట్లు లోపల రగిలిపోయాడు. ఇది గమనించలేదు సరళ. శ్రీధరకేసి చూడకుండానే అంది. "ఇంటికి

వచ్చి భోజనం చేసిపోవటానికి తీరిక వుందిట. పెళ్ళికి పిలవటానికిమాత్రం తొందరపని అడ్డువచ్చిందట పాపం"— ఈ దెబ్బకి శ్రీధర తల గిరగిర తిరిగింది. కొంచెంసేపు నోట మాట రాలేదు. పెదవులు వణికి పోయినయ్. ముఖం కంది పోయింది. సమాధానంకోసం ఎదురుచూస్తున్న సరళ శ్రీధర ముఖాన్ని చూసి కంపించింది. ఇంతలో తనని నిలవరించుకుని శ్రీధర కంపించే స్వరంతో "నీయింట్లో భోజనానికి ఆశపడి మానాన్న వచ్చాడనుకున్నావా. ఆయన అంత నీచుడు కాడు. ఆయన చెప్పకుండా వెళ్ళిపోవటానికి ముమ్మాటికీ నీవే కారణం." అని గబగబా మెట్లుదిగి పోయాడు.

సరళ నిశ్చేష్టురాలైంది. అంతా అర్థంకాని అయోమయంగా వుంది. శ్రీధరని ఎవరో తనదగ్గరనుంచి దూరంగా లాక్కు పోతున్నారనే భయంతో వణికిపోయింది. తన హృదయం భద్రంగా బంధించాలని ఇన్నాళ్ళూ తాను పడిన ప్రయాసంతా వ్యర్థమేనా? ఇంతలో ఆశ గదిలోకి వచ్చింది. తల్లి దూరంగా గిరాటువేసిన వుత్తరం ఆశ ఏరి చేతపుచ్చుకుంది. తల్లి దగ్గిరికి వచ్చి "ఓరు లాశాలే ఉత్తలం?" అని అమాయకంగా అడిగింది. సరళ పట్టరానికోపంతో "ఎవరా? దేముడు!" అంటూ ఆశ చేతిలోంచి ఉత్తరాన్ని లాగి, ముక్కలు చేసి కిటికీలోంచి కిందికి పారేసింది. తల్లి కసురుకునే సరికి ఆశ బిగ్గరగా ఏడ్వటం మొదలు పెట్టింది. కిందిగదిలో కూచున్న శ్రీధర ఆశ ఏడుపు విని పైకివచ్చాడు. తండ్రిని చూడగానే ఆశ తల్లిమీద నేరం చెప్పింది. "ఏదీ ఉత్తరం? ఇవ్వు నాకావాలి." అని శ్రీధర సరళని గర్జించి అడిగాడు.

"నాకు తెలియదు. మీ ఉత్తరాలన్నీ దాచేటందుకే కూచున్నానా యేమిటి?" అని పెంకెగా జవాబు చెప్పింది. "ఉత్తరం చింపిపారేసింది నాన్నా" అని ఆశ తల్లి మీది కోపంతో చెప్పింది "నిజమేనా? చెప్పు. మాట్లాడవేం?" అన్నాడు శ్రీధర. సరళ మరీ బిర్రబిగిసి "అవును, నిజమే. చింపాను. పారేశాను. ఏం చేస్తారో చెయ్యండి" అంది. ఆధోరణి చూసేసరికి శ్రీధరకి చిందులుతొక్కేటంత సివమెక్కింది. తన తండ్రి పంపిన శుభలేఖని సరళ ముక్కలు చేసిందని వినేసరికి అతనికి పట్టరాని దుఃఖంకూడా వచ్చింది. కొంచెంసేపు రాయిలాగా నిలబడిపోయాడు. ఆశవచ్చి తండ్రి చంక నెక్కింది. తండ్రిముఖం కేసీ, తల్లిముఖం కేసీ చూసి బిక్కమొహం వేసింది. వారిద్దరిమధ్యా ఆవరించిన మౌనం ఎంత బరువైనదో ఆపసిగుండెకుగూడా తెలిసింది కాబోలు. దాన్ని భగ్నం చెయ్యటంకోసమే ఆశ ఎవరో కొట్టినట్లు ఏడవటం మొదలుపెట్టింది. ఆశని సముదాయిస్తూ శ్రీధర తన వేదనంతా అణుచుకుని ఇల్లా అన్నాడు- "సరళా, ఒకమాట జ్ఞాపకం పెట్టుకో. దీనికంతకీ నువ్వు పశ్చాత్తాపం పడవలసిన రోజు వచ్చి తీరుతుంది." సరళ మారు చెప్పకముందే శ్రీధర ఆశని ఎత్తుకుని తన గదిలోకి వెళ్ళిపోయాడు.

శ్రీధర తనని తిట్టినా, కొట్టినా సరళకి అంత బాధ కలిగేది కాదు. కాని శ్రీధరనోటినుంచి వచ్చిన ఈమాటలు రెండూ ఆమెని చెప్పలేనంతగా కదిలించి వేస్తున్నయ్. ఆమాటల్లో అశుభం దాగి సరళని భయపెట్టింది అయినప్పటికీ ఆమె అభిమానంమాత్రం ఎదురుతిరుగుతోంది. నేను

ఏంచేశానని? నేను ఎందుకు పశ్చాత్తాపపడాలి? అటువంటి అవసరం ఎన్నడూ రాదు. రాదు. ఇది శ్రీధర కోపంతో అన్నమాట. తను చెయ్యని నేరం ఆరోపిస్తున్నాడు. చేసిన దానికి చింతించవలసిన సమయం వస్తుందని బెదిరిస్తున్నాడు. ఇదంతా మగవారి ఆట. దీనికి నేను లొంగను. నేనెన్నటికీ పశ్చాత్తాపపడను...అటువంటి అవసరమే రాదు అనుకుంటూ అక్కడే కూర్చుండిపోయింది సరళ.

ఇంతలో తన గుడ్డలన్నీ పెట్టెలో వేసుకుని శ్రీధర పైకి వచ్చాడు. సరళ అతని హడావిడి చూసి ఆశ్చర్యపోయింది. ఎప్పుడూ లేని ఉత్సాహం అతని ముఖంలో చిందులు తొక్కుతోంది. అతనికి ప్రతి అడుగులోనూ అపూర్వమైన ఆనందం కనిపిస్తోంది. ఇదిచూచేసరికి సరళ మనసులో భయం తలెత్తింది. ఏమిటీ సన్నాహమంతా? ఎందుకీ ఆనందమంతా? ఏం జరగబోతున్నదో?

ఆశ గబగబ పరిగెత్తుకొచ్చింది మేడమీదికి. తన గౌనులు రెండు చిన్న తువాలులో మూటగట్టి మోసుకొచ్చి "అమ్మా, నేనూ వెల్తున్నా ఊలికి" అని సంతోషంతో చెప్పింది. ఈ మాట వినేసరికి సరళ ఉలిక్కిపడింది. ఊరికి పోవాలని ఆశ పడుతున్న ఆరాటం చూసేసరికి ముద్దువచ్చింది. అమాంతం దగ్గిరికి తీసుకుని "నన్నుకూడా తీసుకుపోతావా" అంది సరళ. కాని వెంటనే నాలుక కరుచుకుంది. ఈ మాట విని శ్రీధర పొంగిపోయాడు. తనతోపాటు తమ్ముడి పెళ్ళికి సరళకూడా వస్తుందనే ఆశ ఒక్కసారి మెరిసింది. తనూ,

సరళా, ఆశా పెళ్ళికి వెళ్తే తండ్రి ఎంత పొంగిపోతాడు! బంధువులంతా ఎంత సంతోషిస్తారు! తన పెద్దకొడుకు చేతి మీదిగా పెళ్ళి జరిగిందని స్వర్గంలో తల్లి ఎంత ఆనందిస్తుంది!

"అమ్మని తీసుకుపోదామా నాన్నా" అని ఆశ తండ్రిని ముద్దుగా అడిగింది.

"మీ అమ్మ వస్తుందా?" అని శ్రీధర సరళకి వినపడేట్లు అన్నాడు. తండ్రి ప్రశ్నకి ఏం చెప్పాలో తెలియక ఆశ తల్లిముఖం కేసి చూసింది. సరళ ఇక పట్టలేకపోయింది. "ఎక్కడికి ప్రయాణం?"

"మా తమ్ముడి పెళ్ళికి."

"అయితే వెళ్ళితీరాలా యేమిటి?"

"ఆ. తప్పక వెళ్ళితీరాలి. నువ్వుకూడా వస్తే అందరికీ సంతోషంగా ఉంటుంది."

"నేనెందుకు? నేను రాకపోతే పెళ్ళి ఆగిపోతుందా? నేను వస్తానన్నే పిలుస్తున్నారా?" అని తల్లి అనేసరికి ఆశ బిక్కముఖం వేసింది. "నేనూ యెల్తానే నాన్నతో" అని తల్లి కొంగుపుచ్చుకుని మారాం చెయ్యసాగింది. సరళ ఆశ చెంప మీద ఛళ్ళున చరిచి, ఏడుస్తుంటేనే బలవంతంగా కిందికి ఎత్తుకు వెళ్ళిపోయింది. శ్రీధర అక్కడే నిలబడిపోయాడు. ఆ చెంపదెబ్బ అతని గుండెలో ఫిరంగిదెబ్బలాగా తాకింది. ఏమిటి చెయ్యటం? ఇక వెనకాడవలసిన పనేలేదు. సరళ

వస్తుందని ఎప్పుడూ అనుకోలేదు. కాకపోతే కొత్తగా కలిగే ఆశాభంగమూ లేదు.

రైలువేళయింది. బండి వచ్చి వాకిట్లో నిలబడింది. వెళ్తున్నానని శ్రీధర సరళకి చెప్పాడు. సరళ మాట్లాడలేదు. ఆశ తండ్రికాళ్ళని చుట్టుకుని విడవలేదు. బండీ సాగిపోయింది. దోవపొడుగునా ఆశ తనతో వస్తానని ఏడ్చిన ఏడుపే చెవుల్లో గింగురుమన్నది. స్టేషనువైపుకు పరిగెత్తిపోతున్న బండీకేసి కిటికీలోంచి చూస్తూ నిలబడింది సరళ. బండి కనుచూపుమేర దాటి మలుపు తిరిగిపోతోంది. దూరంనుంచి శ్రీధర సిల్కు ఉత్తరీయం మాత్రమే కనిపించింది. ఎందుకో తెలియదు కాని అక్కడనుంచి కదలలేదు. చూపులు మరలించలేదు. మళ్ళీ ఎప్పటికి తిరిగివస్తారో అని ఆమె హృదయం అడుగుతోంది ఏమో? ఎవరికి తెలుసు?

ఏడ్చి ఏడ్చి ఆశ తల్లిబుజాన నిద్రపోయింది. ఏమీ తోచక సరళ అటూ ఇటూ పచార్లు చేసింది. తనకి ప్రియమైన వస్తువు పట్టుజారిపోతున్నట్లు భయం వేసింది. ఆమెకి తెలియకుండానే శ్రీధర తనకి దూరమైపోతున్నట్లు తోచసాగింది.

నౌకరు గబగబ పైకి పరిగెత్తుకొచ్చి "నాన్నగారొచ్చారు." అని చెప్పాడు. ఆనాడే సరళ ఆశని తీసుకుని తండ్రితో కలిసి పుట్టింటికెళ్ళిపోయింది. ఈసంగతి శ్రీధరకి తెలపటం అవసరమని ఆమెకి తోచలేదు.

* * * *

శ్రీధర పెళ్ళికి వచ్చాడని బంధువులంతా సంతోషించారు. తండ్రి సంతోషానికి మేర లేదు. కాని అందరి మనసుల్లోనూ శ్రీధర ఒంటరిగా వచ్చాడెందుకన్న ప్రశ్న మెదులుతూనే వుంది. భార్యనీ, పిల్లనీ తీసుకురాని కొరత అందరికీ కష్టంగానే వుంది. పెళ్ళినాడు భోజనాలయిపోయినాక ఒంటరిగా వున్న సమయాన తండ్రి అడిగారు– "నాయనా, ఒక్కడివే వచ్చావేం? కోడల్నీ, పిల్లనీకూడా తీసుకురాకపోయావూ?" అని. శ్రీధర బదులు చెప్పలేక తలవంచేసుకున్నాడు. అతని కనుకొలుకుల్లో వెచ్చటి కన్నీరు తొణికింది.

రాత్రి పందిట్లో శ్రీధర ఒక్కడే కూచుని వున్నాడు. అతని చెవుల్లో ఇంకా ఆశ గొంతుచించుకుని ఏడ్చిన ఏడుపు మోగిపోతోంది. అతని కళ్ళెదుట ఇంకా ఆ దృశ్యం కొట్టవచ్చినట్లు కనిపిస్తోంది. దుఃఖంతో పాటు అతని మనసులో ఆనందంకూడా గంతులు వేస్తోంది. తను సంకెళ్ళని పటపట తెంపివేశాడు. ఊపిరిసలపని చీకటికొట్లోంచి బైటపడ్డట్టుంది. ఈ గాలీ, ఈ వెలుతురూ...ఇప్పుడు తనేం చెయ్యాలి? ఇక ముందు తను ఏబాటలో అడుగుపెట్టాలి?

"బావా" అన్న పిలుపు శ్రీధర ఆలోచనలకి అడ్డుపడింది. వెనక్కి తిరిగిచూశాడు. అవునవును. అదే మెరుపు ముఖంలో. అదే వెలుగు ఆ చిలిపికళ్ళలో. అదే చురుకుతనం. ఆ ఉంగరాల ముంగురులలో. శ్రీధర తన కళ్ళని తనే నమ్మలేకుండా వున్నాడు. ఇక్కడికెల్లా వచ్చింది? ఈ సమయంలో ఎల్లా వచ్చింది? శ్రీధర బదులు చెప్పకమునుపే

"ఏం బావా, మరిచిపోయావా?" అని అడిగింది లలిత. "అల్లా అంటా వేమిటి లలితా? ఇంతలోనే మరిచిపోతా ననుకు న్నావా?" అన్నాడు శ్రీధర. "ఏమో, నాలాటి అభాగిని నీ కింకా గుర్తుండవలసిన అవసర మేముంది? నిజంగా నువ్వు నన్ను మరచిపోలేదా? బావా, ఎంత దయ నామీద?" అంది లలిత. అంటుండగా ఆమె కంఠం వణికింది. ఆమె కంట కన్నీరు తొణికింది. వెంటనే శ్రీధర చూపు లలిత నుదుటి మీదికి పోయింది. విచారంతో అక్కడే నిలచిపోయింది. ఇది గమనించి లలిత దీనంగా తలవంచుకుంది. మంగళచిహ్న మైన కుంకుమలేని ఆమె నుదుటికేసీ, అంచులులేని తెల్ల ఖద్దరు వలువలో వున్న ఆమెరూపంకేసీ శ్రీధర చూడలేక పోయాడు. అతనిగుండె చివుక్కుమన్నది. లలితని ఏవిధంగా పలకరించాలో అతనికి తెలియుటం లేదు. మూగగా లలిత కేసి చూస్తూ నిలబడిపోయాడు. "వెళ్ళివస్తాను బావా. ఇంకా వుంటావా రెండురోజులు? రేపొకసారి తీరిక చేసుకుని మాబడికి వచ్చి చూసివెళ్ళాలి." బడిఏమిటనీ, ఎక్కడ వుందనీ అడగ కుండానే "ఓ. అల్లానే వస్తాను" అనేశాడు శ్రీధర.

లలిత వెళ్ళిపోయింది. శ్రీధర అక్కడే కూర్చుండి పోయాడు. అతని మనసు తెలియని విచారంతో బరువెక్కి పోతోంది. చిన్నప్పటినుంచీ లలితా, తనూ ఆటపాటల్లోనూ, చదువుసంధ్యల్లోనూ ఒకళ్ళ నొకళ్ళు విడిచి వుండేవాళ్ళు కారు. అతని మేనమామకి చిన్నప్పటినుంచీ లలితని శ్రీధర కిచ్చి పెళ్ళి చెయ్యాలని వుండేది. అందరూ అల్లాగే ఆశపడే వారు. కాని చివరికి జరిగింది వేరొకటి. శ్రీధర సుఖపడతా

డనీ, చదువుకోటానికి అత్తవారు సాయంచేస్తారనీ, అతని భారం వాళ్ళే భరిస్తారనీ శ్రీధర తండ్రి సరళ సంబంధాన్ని ఒప్పుకున్నాడు. శ్రీధర తల్లికి చిన్నప్పటినుంచీ లలితనే చేసుకోవాలని వుండేది, కాని దారిద్రబాధ పడిపడి వున్న వారి ప్రాణాలకి సరళ అదృష్టదేవతగా కనిపించింది. చివరికి ఇంచుమించు తాంబూలాలు పుచ్చుకోవటం దాకా వచ్చిన లలితని తోసేసి సరళని కోడలు చేసుకోవలసి వచ్చింది. లలిత మీద శ్రీధరకి మక్కువ లేకపోలేదు. కాని సరళ కూడా తెచ్చే అదృష్టాన్ని తృణీకరించి లలితతో వచ్చే పేదరికాన్ని పెళ్ళాడే నిబ్బరం అతనికి లేకపోయింది. ఈ పెళ్ళి తప్పిపోయినందుకు అంతా నొచ్చుకున్నారు. కాని తప్పుమాత్రం తమది కాదని ఎవరికి వా రనుకున్నారు. ఎన్ని నేరాలు వేసినా నోరెత్తకుండా భరించే విధినెత్తినే ఈ బరువుకూడా వేసి అందరూ తృప్తిపడ్డారు.

అయిపోయిందనుకున్న సంబంధం తప్పిపోయింది. తరువాత లలితకు సంబంధం దొరకటం కష్టమయిపోయింది. ఆ దిగులుతోనే లలితతల్లి స్వర్గం చేరింది. ఆ దిగులుతోనే లలిత తండ్రికి ఇంచుమించు మతిపోయింది. చివరికి ఆ నిరాశలో ఎవరు కనబడితే వారికే లలిత నిచ్చి తన బరువు వదిలించుకోవాలనే స్థితికి వచ్చాడు. ఒక రోజున షష్టిపూర్తికోసం ఎదురుచూస్తున్న మూడో పెళ్ళివాడికి లలితనిచ్చి పెళ్ళి చేశాడు. మునుపటి రెండు సంబంధాలకీ ఆయనకు పదిమంది పిల్లలు. మొదటి సంబంధం కూతుళ్ళకి లలితకంటే పెద్దపిల్లలు కూడా వున్నారు. తండ్రిమనసు కుదుటపడుతుందనే ఆశతో

లలిత ఈ పెళ్ళికి ఒప్పుకుంది. కాని పెళ్ళిఅయిన ఆరునెలలకే ముసలి పెండ్లికొడుకు మృత్యువుతో నాలుగో పెళ్ళి చేసుకున్నాడు. ఈదుఃఖంతో ఏడాది తిరగక మునుపే లలిత తండ్రి ప్రాణం వదిలేశాడు.

ఈ ఘటనల వివరమంతా శ్రీధరకి తెలియదు. కాని కుంకుమలేని లలిత నుదుటికేసి చూడగానే అతను బెదిరిపోయాడు. అభాగినిగా లలిత తనముందు నిలబడింది. ఆమె ముందు శ్రీధర దోషి అయినట్లు చిన్నబుచ్చుకున్నాడు. తను వేసిన తప్పటడుగు ఫలితమంతా లలితలో మూర్తీభవించినట్లనిపించింది. ఆమె జీవితంలోని దుఃఖానికి తను కొంతవరకైనా బాధ్యుడయినట్లు లోలోపల వణికిపోయాడు.

మర్నాడు లలిత మళ్ళీ వచ్చింది. ఆమెతో కలిసి బడి చూడటానికి బయలుదేరాడు. దోవలో ఒక్కమాటకూడా మాట్లాడలేకపోతున్నాడు. లలిత శ్రీధరమౌనానికి చకితురాలయింది. "బావా, ఇంతమౌనం మా అక్కదగ్గిర నేర్చుకున్నావా? మునుపు ఎంత మాటకారివి! ఇల్లా మారిపోతావని కలలోనైనా అనుకోలేదు." అంది లలిత. బదులుగా శ్రీధర చిరునవ్వు నవ్వి ఊరుకున్నాడు.

లలితబడిని చూడగానే శ్రీధరకి పట్టలేని సంతోషం వేసింది. పిల్లలంతా రాట్నాలు గిరగిరా తిప్పుతూ హిందీపాటలు పాడుతున్నారు. వారి కలకలంలో అతని మనసులోని దుఃఖం దూరంగా పారిపోయినట్లుగా వుంది. ఆ పిల్లల ఆనందం ఎంతటి కష్టాన్నయినా, ఎంతటి విచారాన్నయినా మరిపించివేసేట్లు

న్నయ్. లలితకూడా తన దుఃఖాన్ని ఈ విధంగా పారదోలు కున్న దనిపించింది. దిక్కులేని లలిత ఇంతమంది పిల్లల ఆట పాటల్లో తన ఒంటరితనాన్ని మరిచిపోతున్న దనిపించింది.

బడివిడిచినాక పిల్లలంతా వెళ్ళిపోయారు. 'అక్కా, వెళ్ళివస్తాం' అని ఒక్కొక్కరూ వచ్చి శలవు తీసుకు వెళ్ళి పోయారు. అంతా వెళ్ళిపోయాక శ్రీధర "లలితా" అని పిలి చాడు. "ఏమిటి బావా!" అంది లలిత. "నన్నుకూడా నీబళ్లో చేర్చుకుంటావా" అని అడిగాడు.

* * *

"నువ్వు మా పల్లెటూరి బళ్ళో ఎందుకు చేరతావులే! ఊరికే అంటావుగాని."

"కాదు లలితా. నిజంగా అంటున్నాను. ఈ పిల్లల ఆటపాటల్లో అన్నీ మరిచిపోవాలని వుంది. ఈ కాస్సేపటిలో నే నా మనస్సు ఎంతో తేలిక పడింది."

"మా అక్కనికూడా తీసుకొస్తే ఇంకా బాగుంటుంది. బడిని ఎంతో పైకి తీసుకురాగలం. ఏం బావా, మాట్లా డవేం?" ఏం చెప్పాలో తెలియక శ్రీధర తలకిందులైపోయాడు. లలిత సరళని గురించి అడిగినప్పుడల్లా అతని మనస్సు ఎందుకో తికమక పడిపోతోంది. శ్రీధర మాట్లాడక పోయేసరికి లలిత మళ్ళీ అంది: "మాట్లాడవేం బావా? మా అక్కకి ఈ పల్లె టూరు రావాలని లేదా? అంత చదువుకున్న మనిషి. అటు వంటివాళ్ళు ఒకళ్ళున్నా చాలు- పల్లెటూళ్ళు ఎంతో బాగు పడతయ్." నిజమేననిపించింది శ్రీధరకి. కాని ఏం చెప్పాలో

పాలుపోలేదు. ప్రసంగం మార్చి "నిజంగా నన్ను చేర్చుకుం టావో లేదో చెప్పు." అన్నాడు. "ఎందుకు చేర్చుకోను బావా! కళ్ళు కద్దుకుంటాం. మా పిల్లలకి ఇంగ్లీషు చెబుదుగాని. మాష్టరు లేకపోవటంవల్ల హిందీ ఒక్కటే చెబుతున్నాను." అంది లలిత. "బాగుంది. అయితే నాకు హిందీ చెబితేనే నేను నీబళ్ళో చేరుతాను." అన్నాడు శ్రీధర. "నాకు ఇంగ్లీషు నేర్పితేనే నిన్ను బళ్ళో చేర్చుకుంటాం." అని లలిత నవ్వుతూ బదులు చెప్పింది.

* * * *

శ్రీధర జీవితంలో ఇటువంటి మార్పు వస్తుందని కలలో గూడా ఎవరూ అనుకొని వుండరు. పెళ్ళికి వచ్చినవాడు వెంటనే వెళ్ళిపోతాడని అంతా అనుకున్నారు. అటువంటి తొందరేమీ శ్రీధరలో కనిపించలేదు. ఆ పల్లెటూరిలోనే తాను ఉండిపోదలచినట్లు తెలపగానే అంతా ఆశ్చర్యపడ్డారు. అతనికీ, అత్తవారికీ తెగ తెంపులైనయ్యనుకున్నారు కొందరు. అతనికీ, భార్యకీ మనసులు కలవక విడిపోయారని ఊహిం చారు కొందరు. ఎవరికి తోచినట్లు వారూహించారే. కాని యదార్థం ఎవరికీ తెలియదు.

కాని శ్రీధరకి మాత్రం బడితప్ప ఇంకో ప్రపంచమే లేదు. అప్పుడప్పుడు ఆశనికూడా ఈ బళ్ళో వేస్తే ఎంత బాగుంటుంది అనుకునేవాడు. ఏప్పుడూ ఆశ కోసమే అతని మనస్సు కలవరించేది. ఆశకోసమే అతనికి ఇష్టంలేకపోయినా సరళకి ఎన్నో ఉత్తరాలు రాశాడు. ఒక్కదానికీ జవాబు

లేదు. చివరికి ఒకనాడు స్వయంగా బయలుదేరి ఇంటికి వెళ్ళాడు. దిగినబండిలోనే మళ్ళీ ఎక్కవలసి వచ్చింది. ఇంటికి తాళం. నౌకరుకూడా లేడు. తెరిచిన కిటికీలోంచి తను రాసిన తెరవని కవర్లు మట్టిలో పొర్లాడుతూ కనిపించి నయ్. అతనికి పట్టలేనంత కోపంవచ్చింది. గిర్రున వెనక్కి తిరిగి పల్లెటూరికి దోవపట్టాడు. ఆశని చూడాలనే ఆరాటాన్ని అణుచుకుంటాడు. కాని తనుమాత్రం ఇక మామగారిగుమ్మం తొక్కడు. సరళ తనదగ్గరికి రావలసిందేకాని తనుమాత్రం సరళ కాళ్లదగ్గరికి పోడు. ఏం జరిగినాసరే.

కోడలినీ మనమరాలినీ తీసుకురాకుండా శ్రీధర ఒంటరిగా తిరిగిరావటం చూసి అతనితండ్రి నివ్వెరపోయాడు. "ఏం జరిగింది నాయనా?" అని అడిగాడుతండ్రి. శ్రీధర బలవంతాన కన్నీళ్ల నాపుకుని "జరిగేదేముంది నాన్నా. ఏమైనాసరే, ఇక నేను పోదలుచుకోలేదు. ఏదోవిధంగా ఇక్కడే కాలం వెళ్లదీస్తాను." అన్నాడు. శ్రీధర లోపలిబాధని తండ్రి వెంటనే గ్రహించి ఇక ఆవిషయం ప్రస్తావనతీసుకురాలేదు.

కొన్నాళ్లు పోయాక శ్రీధరకి తెలియకుండా తండ్రి రెండోకొడుకుని పంపాడు. వదినెగారిని తీసుకురావటానికి మరది వెళ్ళాడు. కాని అనుకున్నట్లే జరిగింది. శ్రీధర మామగారు "నువ్వెవరివో నేనెరుగను పో" అని తిప్పిపంపేశాడు. మరది పుట్టెడు అభిమానం మూటగట్టుకుని ఇంటికి తిరిగి వచ్చాడు. సరళ అతన్ని గుర్తుపట్టింది. కాని పలకరించలేదు.

(4)

అందుకే మరది మనస్సు మరీ కష్టపడింది. తరువాత ఈసంగతి శ్రీధరవిని మరీ మండిపడ్డాడు. ఈఘటనవల్ల అతని మనస్సు మరీ గట్టిపడింది. ఇక ఏమయినాసరే ఆ గడప త్రొక్కను, త్రొక్కను అనుకున్నాడు.

కొన్నాళ్లు భార్యదగ్గరినుంచి ఏమైనా ఉత్తరంవస్తుం దేమోనని ఎదురుచూశాడు. చివరికి ఆ ఆశకూడా వది లేశాడు.

బళ్ళో పిల్లలందరినీ తన పిల్లలమాదిరే చూసేవాడు. వాళ్ళందరూ అతన్ని నిమిషమైనా విడవకుండా చుట్టేసేవాళ్లు. అతనికి దూరమైన కూతురు ప్రతిపిల్లలోనూ కనిపించి అతన్ని ఊరడించేది. అతని కళ్ళకి అందరూ ఆశలాగే కనిపించేవాళ్ళు.

ఇదివరకెప్పుడూ లేని ఆనందం శ్రీధరజీవితంలో నలుమూలలా వెన్నెలలాగా వ్యాపించింది. ఇంతకాలమూ అతని జీవితంలో సరళ రోహిణికార్తెలోని ఎండలాగా అధికారం చలాయించింది. ఇంతకాలమూ చీకటికోణంలో అతని హృదయం బందీ. ఇప్పుడో? శరత్ కాలంలోని చల్లటివెన్నెలలాటి స్నేహంతో అతని హృదయాన్ని లలిత కమ్మివేసింది. తొలకరివానకు బీటలువారిన కేదారం ఏవిధంగా పులకరించిపోయి సుగంధాన్ని వెదజల్లుతుందో ఆమాదిరిగానే లలిత పరిచయంవల్ల శ్రీధరజీవితం సేదదీరి కొత్త ఆనందంతో గంతులు వేస్తోంది. లలిత అతని దుఃఖాన్నంతనీ మరిపించివేస్తోంది. ఇదివరకెన్నడూ తొక్కి యెరగని సీమలకి దారులు చూపుతోంది. ఇదివరకెన్నడూ విని యెరుగని మాధురులతో అతని

హృదయం మోగిపోతోంది. ఇప్పటి శ్రీధర ఉత్సాహం విడుదలబొందిన ఖైదీ ఆనందం. ఇప్పుడతని జీవితం మునుపు చవి చూడని స్వేచ్ఛతో మత్తెక్కిపోతోంది. అందుకే ఆనాడు శ్రీధర లలితకి ఇంగ్లీషుపాఠం చెప్పటం మరచిపోయి "లలితా, నాచీకటిలో వెలుగుచూపించావు. నీ మేలు ఎన్నటికీ మరిచిపోను." అన్నాడు. లలిత వినికూడా విననట్లుగా "ఇవాళ పాఠంలేదా?" అంది. "లేదు లలితా, నీదగ్గర నేను నేర్చుకోవలసిన పాఠాలెన్నో వున్నయ్." అని శ్రీధర లలితముఖం కేసి చూస్తూ వుండిపోయాడు. "అదేమిబావా, నువ్వుమాట్లాడేదేమిటో నీకు అర్థమవుతోందా?" అని కొంటెగా అడిగింది లలిత. క్షణంసేపుండి శ్రీధర అందుకున్నాడు-"లలితా, నువ్వు మరిచిపోయావేమోగాని నేనుమరిచిపోలేదు. మరిచిపోలేను. ఆనాడు మీనాన్న ఎంతో దీనంగా అడిగాడు. నీజీవితంలో వెలుగులేకుండా చేసి చీకటితోనింపిన పాపినినేను. అటువంటి అపరాధిని చీకటిలోంచి వెలుగులోకి తీసుకొచ్చావు. ఉపకారంద్వారా నామీద పగసాధించ దలిచావుకాబోలు."

ఈమాటలు విని లలిత కంపించిపోయింది. తలఎత్తి మునుపటిలాగా శ్రీధరముఖం కేసి చూడలేకపోయింది. మునుపటిలాగా చనువుగా 'బావా' అని పిలవలేకపోయింది. ఛటుక్కున లేచి వెళ్ళిపోయింది. తనతో శ్రీధర ఈమాదిరిగా మాట్లాడటం వింతగావుంది. అతను అన్నమాటల్లో అబద్ధమేమీ లేదు. కాని అటువంటి మాటలని శ్రీధర నోటినుంచి వింటానని మాత్రం లలిత కలలోనైనా తలపోయలేదు.

తీరా అన్నతరవాత శ్రీధర సిగ్గుతో ముగ్గిపోయాడు. లలిత ఇక తనతో ఎన్నడూ మాట్లాడదేమోనని బెదిరి పోయాడు. తను అన్నదానిలో అక్రమమేమీ లేదు. కాని వాటిలో తప్పులేకపోతే లలిత ఆవిధంగా ఎందుకు వెళ్లి పోవాలి? ఆమాటలు వినేసరికి ఆమెముఖం ఎందుకు కంది పోవాలి? ఇక తన హృదయానికి చల్లటినీడ ఎక్కడ దొరుకు తుంది? ఇక తనమీద అంతహాయినిచ్చే సుఖాన్నీ, స్నేహాన్నీ, సానుభూతినీ ఎవరిస్తారు? తనమాటలవల్ల నిజంగా అటువంటి ఉపద్రవమే వస్తే ఇక తనకేదిదారి?

* * * *

వారాలు గడిచినయ్. నెలలుగడిచినయ్, ఏడాది గిర్రున తిరిగిపోతోంది. కాని శ్రీధర కబురులేదు. జాడలేదు. నాన్న, నాన్న అని ఆశ ఒకటేకలవరింపు. తోడిపిల్లలుతండ్రు లనిగురించి చెబుతుంటే ఆశ "అమ్మా, నాన్నఎప్పొలొత్తాడే" అని దీనంగా అడిగేది. ఏంచెప్పాలో తెలియక సరళ తికమక పడిపోయేది. ఏదో చెపితేకాని ఆశ ఊరుకోదు. అందుకని "వస్తారమ్మా రేపొస్తారు" అనేది, కాని అటువంటి రేపు లెన్నో వెళ్లిపోయినయ్.

పుట్టింట్లో భర్తని ఎడబాసి తనూ, కూతురూవున్న ఈ ఏడాదిలో ఎన్నో అనుకోని మార్పులు జరిగినయ్. సరళకి అడుగడుగునా దెబ్బతాకే సంఘటనలే. అదేమిచిత్రమో కాని తాకిన దెబ్బమీదే మళ్ళీ దెబ్బతగులుతుంది. ఈఏడాది లోనే తండ్రిఉద్యోగం మాని పింఛను పుచ్చుకోవటం జరి

గింది. తాళంచెవి తండ్రి చేతుల్లోంచి తమ్ముడి చేతుల్లోకి పోయింది. పేరుకి తమ్ముడుగాని పెత్తనమంతా తారదే. అందువల్లనే సరళ పని మరీ ఇరుకునపడింది. ఇంట్లో ఇన్నాళ్ళమాదిరిగా స్వతంత్రమూ పోయింది. గౌరవమూ తగ్గింది. సూటి పోటి మాటలతో సరళమీద తార దాడి ఆరభించింది. ఇంతకాలమూ అక్కగారంటే పువ్వుల్లోపెట్టి పూజించేవాడు తమ్ముడు. ఇప్పుడు తనముందరే తార అక్కని మాటలంటున్నా నోరు మెదపకుండా చూస్తూ ఊరుకునే పరిస్థితి వచ్చింది. మరదలు మాటలవల్ల కలిగిన తలవంపుకంటె తమ్ముడు మెదలకుండా ఊరుకోవటమే సరళ సహించలేకపోయింది. ఇక ఈ యింట్లో ఎక్కువకాలం వుండటం అసంభవమని సరళ మనసులో నిశ్చయించుకుంది. కాని ఎక్కడికి పోవటం? ఏడాది అవుతుంటే తన అతీ గతీ కనుక్కోని శ్రీధరని వెతుక్కుంటూ వెళ్ళాలా? అతనుంటున్న పల్లెటూరికీ, అతని పూరిగుడిసెకీ తిరిగిపోవాలా? అక్కడ అడుగుపెట్టటమే ప్రాణసంకటంకదా! కాని తనకి వేరేదారి ఏముంది?

ఇల్లావుండగా ఒకనాటి పొద్దున్నే సరళ తండ్రి సామానంతాసర్దుకొని కూతురుకోసం కబురంపాడు. "ఎక్కడికి నాన్నా ప్రయాణం?" అని అదుర్దాగా అడిగింది సరళ. ఎన్నాళ్ళనుంచో తనకి యాత్రలు చెయ్యాలనివుందనీ, ఉద్యోగంనుంచి విరమించిన దగ్గరనుంచీ ఏమీ పొద్దుపోవటం లేదనీ, అందుకని యాత్రలు చేసివద్దామని బయలుదేరాననీ తండ్రి చెప్పాడు.

తననికూడా వెంట రమ్మంటాడేమోనని ఆశపడింది సరళ. కాని తండ్రి ఆమాటలేమీ లేకుండా "అమ్మా, అతని సంగతే మయినా తెలిసిందా?" అని అడిగాడు. సరళ లేదని తల వూపింది. "ఇదిగోనమ్మా, తీసుకో, మీ అమ్మ పోతూపోతూ నీ కిమ్మని చెప్పిపోయింది. ఇవిగో నాలుగు వేలరూపాయలు తీసుకో. అతనికి ఉత్తరంరాసి ఎక్కడున్నాడో కనుక్కో. ఇక ఏదయినా ఉద్యోగంలో చేరటం మంచిదని చెప్పు. బండికి వేళయింది, వెళ్ళొస్తా" నని చెప్పి సరళ బదులు చెప్పే లోపుగానే బండీ ఎక్కేశాడు.

ఈఘటన ఫిరంగిదెబ్బలాగా తాకింది సరళకి. ఇక ఎవరి అండ చూచుకుని తనూ, తన కూతురూ ఆయింట్లో వుండాలి? ఇక తమని వెనకేసుకొచ్చేవాళ్ళెవరు? తమని ఆప్యాయంగా ఆదరించే వాళ్ళెవరు? వెళ్ళితీరాలిసిందేనా? వేరేమార్గం లేదా? ఆ పేదగుడిసె తప్ప తనకి పోడగిన తావులేదా? అని దరీ తెన్నూ లేని అఖాతంలోపడి తన్నుకుంటోంది సరళ. ఆశ పరిగెత్తుకుంటూవచ్చి "అమ్మా, ఉత్తరం వచ్చిందే, నాన్న రాశాడే" అంటూ పట్టలేని ఆనందంతో గంతులు వేసింది. సరళ ఆశ్చర్యం పట్టలేక ఆశని అమాంతం ఎత్తుకుని చేతుల్లోంచి ఉత్తరం తీసుకుంది. "నాన్న రాశారని ఎల్లా తెలుసే?" అంది సరళ. కారణమేమీ చెప్పకుండానే "నాకు తెలుసుగా" అంది ధీమాగా ఆశ. పట్టలేని ముద్దు వచ్చింది సరళకి.

అది చాలా చిత్రమైన ఉత్తరం. ఉత్తవాళ్ళనికూడా తలకిందులు చేయగల ఉత్తరం. అందులో సరళ చిక్కుకున్న పరిస్థితుల్లో ఆ ఉత్తరాన్ని చదివి తట్టుకోలేకపోయింది. "నీ భర్త నీకు దక్కాలనుకుంటే నువ్వు ఈ నిమిషంలో బయలు దేరిరావాలి. చేతులు కాలినాక ఆకులుపట్టుకుని లాభంలేదు.- ఇట్లు, నీ ప్రియమిత్రురాలు హితకారిణీదేవి." అనివుంది.

ఎందుకనో మొదటినుంచీ అశుభమే శంకిస్తున్నది సరళ హృదయం. అందులో యీ ఉత్తరాన్ని చదివేసరికి ఆమెని తట్టుకోలేని భీతి, ఆందోళనా ఆవరించినయ్. శ్రీధర ఏదైనా ప్రమాదంలో చిక్కుకున్నాడేమో? అతనికేమైనా జబ్బుచేసిందేమో? అతనిక తనకి దక్కడేమో? తన అవివేకానికి ఎంతో విచారం వేసింది. అతను ఆనాడు 'నువ్వు ఒక రోజు పశ్చాత్తాపపడతా' వన్నమాటలు మాటిమాటికీ గుర్తుకొచ్చి సరళ జలదరించిపోతోంది. ఏమో, ఏం జరగబోతున్నదో? తల్లి తత్తరపాటు చూసి ఆశ "ఏం రాశాడమ్మా? నాన్న ఎప్పుడొస్తాడు? చెప్పవే? ఎప్పుడొస్తాడే!" అంటూ తల్లిని చుట్టుకుంది. క్షణంసేపు ఊరుకుంది సరళ, ఏంచెప్పాలో తెలియక. చివరికి అప్రయత్నంగా అనేసింది. "మనమే వేళ్దాం తల్లీ, నాన్నదగ్గిరికి"

"ఎప్పుడమ్మా? ఎప్పుడు?"

"ఇవాళే వెళదాం. ఈ రాత్రి రైల్లోనే వెళదాం. పద బట్టలు సర్దుకుందాం" అని బయలుదేరింది.

సరళ ప్రయాణంమాట విని తార పొంగి పోయింది. ఎన్నడూ లేని ఆపేక్ష ఒక్కసారిగా వచ్చిపడింది. నోటినిండా 'వదినా' అని పిలిచింది. ఎన్నడూ లేనిది ఆశని దగ్గరికితీసి "మీ యింటికి వెళుతున్నావా?" అంది. రోజూ తారచూపే నిరాదరణకంటె అమాంతం కలిగిన ఈ ఆదరణే మరీ దుర్భరమైంది సరళకి. తను వెళ్ళిపోతున్నందుకు తారమనస్సులో కలిగిన సంతోషమే ఈ ఆదరణగా బైటపడింది. ఇది గ్రహించగానే సరళ గుండె మండి, ఇక ఏమైనాసరే ఈగడప తొక్కననే నిశ్చయంతో బయలుదేరి వెళ్ళిపోయింది. ఇక ముందు తన జీవితంలో ఏ ఆపదవచ్చినా, ఏ దుఃఖంవచ్చినా ఇంకెక్కడికయినా పోవచ్చునుకాని తమ్ముడి ఇంటికి మాత్రం రానని గట్టి పట్టుతో వెళ్ళిపోయింది.

దారిపొడుగునా ఆశ "ఇంకా ఊరెంతదూరమమ్మా" అని అడుగుతోంది. నాన్నని తలుచుకుంటూ ఏవేవో కబుర్లు చెబుతోంది. సరళకి మాత్రం మనసు మనసులో లేదు. ఇన్నాళ్ళనుంచీ ఆమెమనసుని కమ్మిన మబ్బులన్నీ విడిపోయినయ్. ఇంతకాలమూ ధనమూ, దరిద్రమూ అని అంతరాలు కల్పించుకున్నందుకు ఎంతో సిగ్గుపడుతోంది. అసలు ఇంతకాలం ఎందుకు తను శ్రీధరకి ఎడంగా వున్నానని ప్రశ్నించుకున్నది. మనస్సు ఎన్నో కారణాలు చెప్పింది. కాని అన్నింటినీ సరళ తుంచివేసింది. ఇంతకాలమూ ఎవరో తనని పెడదారిలో నడిపించారు. తాను గుడ్డిగా నడిచింది. ఇప్పుడు కళ్ళు తెరిచింది. తన తాహతు ఏమిటి? తన ధన మేమిటి? శ్రీధరవైపువాళ్ళకు

లేని దేమిటి? ఇంతమాత్రానికే తాను వారినందరినీ వెలివేసి నట్లు చూడటమేమిటి? ఒక్కొక్కటి తలుచుకుంటుంటే సరళకి తనమీద తనకే పట్టలేని కోపం వస్తోంది. తను ఈజన్మలో శ్రీధర పుట్టిన పల్లెటూరి పూరిగుడిసెలో అడుగుపెట్టనని ఇదివరకెన్నోసార్లు బడాయిలు కొట్టింది. కాని నిజం చెప్పాలంటే ఇవాళ ఆ పూరిగుడిసె ఎప్పుడు కళ్ళపడుతుందా అని ఎంతో కొట్టుకుపోతోంది సరళ. శ్రీధరకి ఏం ప్రమాదం జరిగిందో అని భయపడిపోతోంది. అతను సురక్షితంగా వుండాలని ఎంతో ఆరాటపడుతోంది.

దోవలో పెద్ద రైల్వేజంక్షను. అక్కడ బండి చాలా సేపు ఆగుతుంది. ఆశకి కాఫీఅయినా ఇప్పిద్దామని సరళ ఆశని చెయ్యిపుచ్చుకుని నడిపించుకుపోతోంది ప్లాట్‌ఫారంమీద. రెండడుగులు వేసిందో లేదో వెనకనించి ఎవరో "హలో మై డియర్ సరళా" అని ఈలవేసి పిలిచారు. సరళ నిలబడి పోయింది. ఆ మనిషిని చూడగానే సరళ వెలవెలబోయింది. ముఖాన కత్తివేసినా నెత్తురుచుక్కలేదు అడుగు ముందుకి పడలేదు. ఆపుకోలేకుండా లోపలినుంచి గజగజ వణుకొస్తోంది. ఆమనిషి గబగబా అడుగువేస్తూ సరళదారికి అడ్డంగా నిలబడ్డాడు. అతని సూటూ, బూటూ, దొరటోపీ, నోట్లో పైపూ చూసి ఆశ బెదిరి తల్లిచాటున నక్కి కొంగు గట్టిగా పట్టుకుంది. వీలయితే ఆమనిషిని దులుపుకుపోవాలనుకుంది సరళ. కాని మిలిటరీవేషంలో వున్న వ్యక్తి సరళకి షేక్‌హాండ్ కోసం చెయ్యిజాపి "ఎంతఅదృష్టం! అబ్బా, ఇన్నాళ్ళకి

ఇక్కడ కలుసుకున్నాం" అన్నాడు. సరళ అతని చేతిని అందుకోలేదు. అతడికి బదులు చెప్పలేదు. కాని ఆవ్యక్తి వెనక్కి తగ్గలేదు. ఒక్కగుక్కలో ఆరేళ్ళకిందట తను యుద్ధంలో డాక్టరుగా చేరినదగ్గరినుంచి జరిగిన ఘటనలన్నీ చెప్పుకుపోయాడు. సరళ వింటోందా లేదా అన్నది అతడికి పట్టలేదు. యుద్ధంలోంచి సుఖంగా తిరిగివచ్చాడట. స్వతంగా ప్రాక్టీసుపెడతాడట. సరళ ఇదంతా విన్నదో లేదో- కాని ఈవ్యక్తి యుద్ధం నుంచి తిరిగి రాకపోయినా ఆమెకి చీమకుట్టినంత బాధకూడా ఉండేదికాదు. ఇప్పుడు సుఖంగా తిరిగివచ్చినందుకు లేశమయినా సంతోషమూ లేదు. అంతా విని "మంచిది. నేను వెళ్లొస్తా"నని ముందడుగు వేసింది. ఆమనిషితల్లి వెనకనక్కిన ఆశనిజలవంతాన చేతుల్లో ఎత్తుకుని "హల్లో మైలిటిల్ సరళా" అని ముద్దు పెట్టుకోబోయాడు. ఆశ అతని ముఖాన్ని చేతుల్తో దూరంగా తోసేసి అతడితో పెనగులాడి కిందికి జారిపోయింది. "అచ్ఛా గుడ్ బై" అని ఆవ్యక్తి ఎంత ఆకస్మికంగా ప్రత్యక్షమయాడో అంత హఠాత్తుగా అదృశ్యుడయాడు. అతను వెళ్ళిపోయినాక ఎంతోసేపటిదాకా ఆశభయం పోలేదు. తల్లి కొంగు విడవలేదు. రైలు కదిలాక ఇక భయంలేదనుకుని కాబోలు "ఎవరమ్మా, బూచాడా?" అంది. వెంటనే సరళ అవునంది. కాని ఆమనిషిని చూసినదగ్గరనుంచీ సరళమనస్సు వికలమయిపోయింది. కొన్నాళ్ళకిందట వచ్చిన పీడకల మళ్ళీవస్తే ఎంత భయపడతామో అంత బెదిరిపోయింది సరళ అతన్నిచూసి. అతన్ని ఈజన్మలో చూస్తాననుకోలేదు. చూడాలని కోరుకోనూలేదు. కాని భర్తకోసం ఆరాటపడుతూ పోతున్న ఈ

తరుణంలో ఆవ్యక్తి హఠాత్తుగా ప్రత్యక్షమయేసరికి ఆమెకి పిడుగుదెబ్బ తాకినట్లయింది. గడచిన ఘటనలెన్నో మెరుపులాగా తళుక్కుమన్నయ్. తనూ, అతనూ కాలేజీలో కలిసిచదువుకోటం, తమ ఇంటికి అతను వస్తూపోతూవుండటం, తమ పరిచయానికి తండ్రి సంతోషించటం, అతఃకిచ్చి పెళ్ళిచెయ్యాలనుకోవటం, అతనితో కలిసి విచ్చలవిడిగా తను కారులో షికార్లుచెయ్యటం, అప్పుడు లోకంలో అపవాదు ఒక్కసారి తుపానులాగా రేగటం, తనని నడిసముద్రంలో ముంచి ఆ మోసగాడు ఎవరికీ చెప్పకుండా యుద్ధంలోకి పారిపోవటం, ఆ అపవాదువల్ల తనకి ఎన్నాళ్ళకీ పెళ్ళికాకపోవటం, చివరికి డబ్బుఆశతో శ్రీధరని తన తండ్రి వలలోవేయుటం...అన్నీ ఒక్కసారి గిర్రున తిరిగినయ్. తలుచుకుంటే సరళకి తెలియకుండానే కళ్లు తడిసినయ్. నిజంగా ఆ వ్యక్తికదా తన సర్వనాశనానికి కారణం? అతనికంటే తనకి పరమశత్రువింకెవరూ లేరు. అతను ఎదుటపడేసరికి ఆమె సహించలేకపోయింది. తన గతజీవితమే ఆవ్యక్తిరూపంలో ఎదుటపడి వెక్కిరిస్తున్నట్లనిపించింది. ఆ హేళననుంచి తలదాచుకోటానికి చోటులేదా? ఆ పీడకల మరిచిపోయి సుఖంగా కాలంగడిపే అవకాశం లేదా? వీటన్నిటినీ మరిపించి చల్లటినీడనిచ్చే హృదయం లేదా? అక్కడికి ఎగిరిపోవటంకంటే, అక్కడ గూడుకట్టుకోవటంకంటే తనకి వేరేదోవ ఏమున్నది? అని సరళ ఆలోచనల్లో సుడితిరుగుతోంది. ఊరువచ్చింది. తల్లి ఒళ్ళో నిద్రపోతున్న ఆశని లేపి రైలుదిగింది.

అక్కడినుంచి సరళ వెళ్ళాల్సిన ఊరు అయిదుమైళ్లకి

వెనకనుంచి "అమ్మాయ్, కాస్త ఆగు తల్లీ!" అని ఎవరో పిలిచారు. ఒక విధవావిడ — ముసలిది, మోయలేనంత పెద్ద మూటని ఈడ్చుకుంటూ వచ్చి "మా తల్లి కాదూ, నీ కడుపున పుడతాను. నీకు పుణ్యముంటుంది. నన్ను కూడా బండీ ఎక్కనియ్యి తల్లీ" అంది రొప్పుతూ. తను వెళ్ళాల్సిన ఊరే వెళ్తోంది ముసలమ్మ కూడా. తోడు దొరికిందనే కాకుండా శ్రీధర సంగతులు కూడా వినవచ్చనే ఆశతో సరళ ముసలమ్మకి బండీలో చోటిచ్చింది. బండీ నాలుగడుగులు సాగిందో లేదో ముసలమ్మ కుశల ప్రశ్నలు ఆరంభించింది. సరళ ఎక్కడినుంచి వస్తోందో, ఎవరింటికి వెళ్తోందో అడిగి తెలుసుకుంది. "నువ్వేషే తల్లి. మా శ్రీధరాయి పెళ్ళానివా? ఒక్కసారయినా మా వూరు రాలేపోతివి. కలవారి బిడ్డవనీ, పెద్దచదువులు చదువుకున్నావనీ విన్నాం. కాని మా బంగారుతల్లిని ఇన్నాళ్ళకి చూశాను. నా పుణ్యం ఏం చెప్పను." అని అంతటితో ఆగక సరళ గడ్డాన్ని బలవంతాన లాగి ఒళ్ళో కూచోబెట్టుకుంది. కొంచెంసేపు మెదలకుండా కూచుని ముసలమ్మ ఒక్కసారి "అయ్యోతల్లి, నా బంగారుతల్లి, నిన్ను చూస్తే నా కడుపు తరుక్కుపోతుందమ్మా, ఇంత చిన్నతల్లికి ఎటువంటి కష్టం వచ్చిపడిందే" అని వెక్కి వెక్కి శోకాలు పెట్టసాగింది. ఇది వినగానే సరళకి బేజారెత్తిపోయింది. శ్రీధరకి ఏదో ప్రమాదం జరిగిందనే భయం మరీ వణికించసాగింది. కారణం చెప్పకుండా ముసలమ్మ శోకాలు పెట్టేసరికి మరీ బెదిరిపోయింది. "ఏం జరిగిందో చెప్పండి మామ్మగారూ" అని సరళ విన్నవించుకున్నది. మారుగా ముసలమ్మ "ఏం చెప్పేదితల్లి? నా

తక్కువుండదు. సరళ బండీ మాట్లాడుకుని ఎక్కబోతుండగా నోరు రావటంలేదు. ఏం జరగాలో అదేజరిగిందమ్మా. ఒక్కసారి నానోరు పడిపోరాదూ" అంది. ఇది విని సరళ మరీ కంపించిపోయింది. "మామ్మగారూ, వారికేమయినా ఆపద వచ్చిందా? ఏమిటో చెప్పండి. నన్ను చంపకండి. చెప్పండి" అని దీనంగా అడిగింది. ముసలమ్మ దుఃఖాన్ని ఒక్కసారి దిగమింగివేసింది. సరళని తన గుప్పెట్లో చిక్కించుకున్నది. ఇక ఏ ముసుగుతో పనిలేదు. సావకాశంగా చెప్పనారంభించింది. అంతా చెప్పి "వాడిని అనవలసిన పనేముందితల్లి? ఆ జిత్తులమారి వలలో వేసుకుంది. నాబంగారుతల్లికి ఇంతద్రోహం తలపెట్టింది. దానికిక ఏడుజన్మలకైనా పుట్టగతులుంటయ్యా?" అని ముగించింది. అంతా విన్న సరళ వెలవెలబోయింది. ఇటువంటి ప్రమాదాన్ని సరళ కలలోకూడా శంకించలేదు. ఆమెకి దరీ తెన్నూ కనిపించలేదు. ఇక తను అక్కడికి పోవలసిన పనేముంది? వెనక్కి బండీ తిప్పమంటే? తిరుగురైలులో వెళ్ళిపోతే? కాని ఎక్కడికి తిరిగివెళ్లటం? ఆశని ఎల్లా మరిపించటం? అయినా ఇదంతా నిజమేనా? ఏమో? ఏం, ఎందుకు నిజం కాకూడదు? అవును. తను అతని మనసుని కష్టపెట్టిన ఘట్టాలూ, బాధపెట్టిన సమయాలూ పందలువేలు కళ్లకు కట్టుతున్నయ్. తనకీ అతనికీ మధ్యఉన్న సంబంధం ఎంతబలహీనమైనదో సరళకి వెంటనే గోచరించింది. ఇంతకాలమూ తను తాళంచెవి చేతులో వుంచుకుని అతన్ని చీకట్లోపడేసి వుంచింది. అతను తనుచేసిన పనులన్నీ ఎందుకు క్షమిస్తాడు? అతని సహనాన్ని తను ఎంతక్రూరంగా పరీక్షచేసింది? అవును.

శ్రీధర నిజంగా ఇంకో స్త్రీకి హృదయం అర్పిస్తే అందులో అతని తప్పేమీ లేదు. ముమ్మాటికీ లేదు. అతనిమీద ఎంత నిందమోపాలన్నా సరళకి సాధ్యం కావటం లేదు. అతను లేశమైనా దోషం లేనివాడిలాగా చిరునవ్వుతో సరళ హృదయంలో ప్రతిబింబిస్తున్నాడు. అయినా అతని కిటువంటి ప్రమాదం సంభవిస్తుందని తను ఎన్నడూ భయపడలేదు. అదీ తన తప్పే బంగారుపంజరంలో పెంచినంతమాత్రాన చిలక ఆకాశాన్నీ, తోటల్నీ మరిచిపోయి పంజరాన్నే ప్రేమిస్తుందా? కత్తివేటులాంటి ఈ వార్తతో సరళ ఒక్కసారి కళ్ళు తెరిచింది. మునుపటి సరళ పనులన్నిటినీ ఇంకెవరో చేసినట్లుగా ఇప్పటి సరళ నిర్దాక్షిణ్యంగా ఖండించి వెయ్యగలుగుతోంది. కాని ఏదో నిరాశా, నిస్పృహా వచ్చి ఆమె మనస్సుని కమ్మివేస్తున్నయ్. తను శ్రీధర దగ్గరకి వెళ్తే అతనేమంటాడో! తనని ఏవిధంగా చూస్తాడో! ఒకటి మాత్రం నిజం. తన మనసుని ఏమాత్రం చిన్నబుచ్చినా తాను సహించదు. అక్కడ తానొక్క నిమిషం కూడా నిలవలేదు. ఆశని అతనికి అప్పగిస్తుంది. ఈమె భారం నీదేనని చెబుతుంది. తాను మాత్రం అక్కడినుంచి మాయమైపోతుంది. ఎక్కడికిపోవాలో అప్పుడే నిశ్చయించుకుంటుంది.

దారిపొడుగునా క్షణంలో ఎండా, క్షణంలో మబ్బూ. రైలుదిగిన దగ్గరనుంచీ ఆశ తల్లిఒడిలో తలపెట్టి నిద్రపోతూ వుంది. సరళ ఎడతెరిపిలేని ఆలోచనలలో గిరగిర తిరిగి పోతోంది. ముసలమ్మ తాను చెయ్యవలసింది ఇంకేమీ లేదనుకుని కాబోలు మెదలకుండా రుద్రాక్షతావళం తిప్పుతూ

రామనామజపం చేస్తోంది.

ఊరిబైటే ముసలమ్మ దిగిపోయింది. బండి సరాసరి శ్రీధర బడివాకిటముందు వచ్చి ఆగింది. తిరిగి వెళ్ళిపోదామనే ఊహతో బండివాడిని ఊడదీసి ఎద్దుకు మేత వేసుకోమని చెప్పింది. బండి ఆగగానే ఆశ ఎవరో కొట్టిలేపినట్లు లేచింది. ఆఇల్లు తను ఇదివరకునుంచీ ఎరిగున్నట్లుగానే లోపలికి ఒక్క పరుగుతీసింది. సరళ సంకోచంతో వీథివాకిట్లో నిలబడివుంది. ఆశ పరుగుతీసి 'నాన్నా' అంటూ లోపలికిపోయింది. వచ్చీ రావటమే తండ్రిపక్క మీదికి ఎక్కి కూచుంది. "అమ్మ వచ్చిందా?" అన్నాడు శ్రీధర. "వచ్చింది." అని చెప్పింది. చిక్కిపోయిన చేతులతో ఆశని గుండెలకదుముకుని శ్రీధర విడవలేదు. ఆశమాటలు విని లలిత గబగబా వాకిట్లోకివెళ్ళి "లోపలికి రా అక్కా. నీ ఇంట్లోకి నువ్వు రావటానికి బిడియ పడతా వేమిటి? లోపలికి రా" అని సరళ చెయ్యిపుచ్చుకుని గుంజుకుపోయింది. "ఎంత నటన! ఎంత కపటం! నాకేమీ తెలియదనుకుంది కాబోలు." అని సరళ లోపల అనుకుం టోంది. లలిత చెయ్యి విదిలించేసుకోవాలనిపించింది. కోపంతో లలితముఖంకేసి చూసింది. మారుగా లలిత కళ్ళల్లో చిరు నవ్వులు మెరిపించింది. "కోపమెందు కక్కా? నీ ఇంట్లోకి నువ్వు రాక వెనకాడుతుంటే బలవంతాన లాక్కువచ్చాను. అందుకేనా కోపం?" సరళ బదులు చెప్పలేదు. ఇంతమా టలు నేర్చిన మనిషి ఎందరి హృదయాలనైనా వలలో వేసు కుంటుంది. అందులో అనుమానమేమీ లేదు. ఇంత నేర్పరి ఎందరినైనాకీలుబొమ్మలుగా చేసుకుంటుంది. అనుకుంటుండగా

మళ్ళీ చెయ్యిపుచ్చుకుని లాగుతూ "బావా, ఇదిగో వచ్చింది అక్క. నువ్వు పిలిస్తేగాని లోపలికిరాదు, అవునుమరి పిలూ" అంటూ శ్రీధర మంచం దగ్గరకి గుంజుకుపోయింది. సరళ తల వంచుకుని నిలబడింది. "ఎందుకు వచ్చాను ఇక్కడికి?" అని తనని తాను లోపల నిందించుకుంటోంది. స్టేషనుకు తిరిగి వెళ్ళిపోతే ఎంత బాగుండేది? ఇప్పుడు నేనిక్కడ ఎల్లా నిలవ గలను? ఇప్పుడు శ్రీధరని ఎల్లా పలకరిస్తాను? ఇక శ్రీధరమీద తనకేమి అధికారముంది? ఇంకొకరిచేత జిక్కిన సొత్తు నాది అనుకున్నంత మాత్రంలో మనస్సుకి క్షోభ తప్ప కలిసివచ్చే దేముంది? అయినా ఆశ ఎంత నిర్భయంగావెళ్ళి తండ్రిమీద కూర్చుందో? ఆశకిమాత్రం అక్కడ చోటుండా? అనుకుంటుం డగా శ్రీధర సరళముఖంకేసి చూసి ఆమెకి తెలియకుండానే తలతిప్పుకున్నాడు. ఏం మాట్లాడాలో అతనికి అంతకంటే తెలి యటం లేదు. పోనీ, సరళ మాట్లాడుతుందేమోనంటే అదీ కనబడటం లేదు. ఈ మౌనం అక్కడున్నవారి నందరినీ మోయలేని బరువుతో కుంగదీస్తోంది. అందరిమాటా అటు వుంచి లలితకి మరీ దుర్భరంగా వుంది. "చూశావా, బావా, పందెంలో నేనే గెలిచాను." అంది లలిత. "ఏమో, నాకు నమ్మకంలేదు" అన్నాడు శ్రీధర. ఈ మాటల అర్థం తెలి యక సరళ లలితనీ, శ్రీధరనీ చూపుతో గాలించింది. ఏమీ బోధపడలేదు. తండ్రిగుండెని దిండుగా చేసుకుని ధీమాగా పడుకున్న ఆశ "నాన్నా, ఎప్పుడూ ఇక్కడే వుంటాను నాన్నా. ఇక తాతయ్యగారింటికి పోవద్దమ్మా. ఇక్కడే వుందాం" అంది. సరళ ఏమీ మారుచెప్పకుండా నిలుచుని

శ్రీధరముఖంకేసి చూస్తూ వుండిపోయింది. చిక్కిపోయిన అతని ముఖంలో ఒక ఆనందరేఖ తళుక్కున మెరిసింది. శ్రీధర ప్రయత్నంమీద అడిగాడు-"నువ్వు కులాసాగా వున్నావా?" అని. సరళకి ఈ ప్రశ్న చురుక్కున తాకింది. ఇంతసేపటినుంచీ తను భర్తక్షేమాన్ని గురించయినా అడగ లేదు. అతను మంచంపట్టి చిక్కిపోయి, పాలిపోయి కనబడు తున్నా తను నోరు తెరిచి అడగలేదు. 'నా యోగక్షేమా లతో మీకు అవసరమేముంది?' అనాలనుకుంది. కాని నోరు పెగలలేదు. చివరికి తలమాత్రం ఊపింది కులాసాయే అన్నట్లు.

ఇంతలో లలిత కాఫీకాచి తెచ్చి ముందు పెట్టింది. ఎంత బతిమాలినా సరళ వద్దంది. లలిత ఇది కనిపెట్టి "నువ్వు చెబితేగాని తాగదు బావా. అక్కని తాగమని చెప్పు." అంది. శ్రీధర వెంటనే మంచంమీదలేచి కూచుని "తాగు సరళా, నీ ఇంట్లో నువ్వు బతిమాలించుకుంటావా?" అన్నాడు. ఆమాట వినగానే సరళ కన్నీళ్ళు నాపుకోలేక పోయింది. కాఫీకప్పు వేళ్ళతో ఎత్తిందికాని ఒక్కగుక్కయినా వెయ్య లేక పోయింది. వేళ్ళు వణికి కప్పు జారి కిందపడి పోయింది. ఇది నా ఇల్లా? నిజంగానా? ఎందుకీమోసం? నిజం చెప్పండి. ఈ ఇంట్లో నాకు అడుగుపెట్టే అధికారముందా అని సూటిగా అడగదలచింది. కాని ఆ ఉద్వేగంలో కాఫీ ఒలికిపోవటం చూసి సిగ్గుపడింది. నోట మాటరాలేదు.

సరళ మనోభావాలని లలిత వచ్చినదగ్గరనుంచీ కని పెడుతూనేవుంది. ఆమె సమయంకోసం వేచివుంది. ఇంకా సమయం రాలేదు. నిజంగా రాలేదు.

ఆనాడంతా సరళ పెడపెడగా వుంది. శ్రీధర దగ్గిరికి పోలేదు. ఒక్కమాటయినా మనసారా మాట్లాడలేదు. అతనికి వేళకి జావా, కాఫీ అన్నీ లలిత యంత్రంలాగా అందిస్తోంది. క్షణమైనా అతనికి ఆలస్యం జరగనివ్వదు. పగలంతా బడిపనిలో తీరిక చేసుకుని మధ్యమధ్య వచ్చి ఏంకావాలని అడిగిపోతుంది. రాత్రి అతనికి నిద్రపట్టకపోతే అతని పక్క దగ్గర కుర్చీ వేసుకుని కూచొని విసురుతూ తను చదివిన హిందీ పుస్తకాలల్లోని కథలన్నీ కళ్ళకికట్టినట్లు చెబుతుంది. వినివిని శ్రీధర నిద్రపోతాడు. అప్పుడు వచ్చి పడుకుంటుంది. రాత్రి మెలకువ వచ్చినప్పుడల్లా లేచివెళ్ళి శ్రీధర నిద్రపోతున్నాడో లేదో చూసివస్తుంది. ఇల్లా శ్రీధరకు జబ్బుచేసిన దగ్గరనుంచీ జరుగుతూ వుంది. సరళ వచ్చిననాడు కూడా ఆమాదిరిగానే లలిత క్షణం ఏమరకుండా శ్రీధరకి సేవచేస్తున్నది. ఇది చూస్తుంటే సరళకి మరీ రూఢిగా తేలిపోయింది. శ్రీధర మనసులో తనకి చోటులేదు. తన సేవవల్ల ఈస్త్రీ అతన్ని పూర్తిగా వశపరుచుకుంది. ఇక తనకి అక్కడ ఆశ్రయం లేదు అని బాగా నిశ్చయించుకుంది. శ్రీధర కథలు విని నిద్రపోయాడు. లలితకూడా నిద్రపోయింది. తండ్రి పక్కలో ఆశ కూడా గాఢంగా నిద్రపోతోంది. చప్పుడు చెయ్యకుండా పిల్లి అడుగులు వేసుకుంటూ సరళ శ్రీధర మంచం దగ్గరకు వెళ్ళింది. క్షణంసేపు అక్కడ నిలబడింది. ఆశ తండ్రి గుండెలమీద సుఖంగా నిద్రపోతోంది. అప్రయత్నంగా సరళ కళ్ళు చెమ్మగిల్లినయ్. ఇక అక్కడ తనకి నిలబడే అదృష్టం లేదు. అవకాశం లేదు. తను వెళ్ళిపోవలసిందే. ఎక్కడికి వెళ్ళాలో

తెలియదు. కాని అక్కడ నిలవటానికిమాత్రం మనసొప్పటం లేదు? మసకచీకటిలో మెల్లిగా అడుగులు వేస్తూ వెనుదిరిగి ఆళ కేసీ, శ్రీధర కేసిచూస్తూ గుడిసెబైటికి వచ్చింది. ముందుకి పోవటానికి కాళ్ళాడలేదు. ఎవరో వెనక్కి బలవంతాన గుంజు తున్నారు. ఇంతమాత్రానికే ఓడిపోయానని ఒప్పుకుంటావా? గెలిచేశక్తి నీదగ్గర లేదూ? ఉండికూడా పిరికిపందలాగా పారి పోతావా? నీభర్త హృదయసామ్రాజ్యాన్ని పాలించే అధి కారం నీదికాదా? అక్కడ ఇంకొకరి విజయపతాకం ఎగురు తుంటే చూస్తూ ఊరుకుంటావా? ఇంతమాత్రం చేతకాదా? అని సరళ లోపలినుంచి ఎవరో ఖంగున మ్రోగే కంఠంతో చెబుతున్నారు. అవును, నేను ఓటమిని ఒప్పుకోను. ప్రయ త్నిస్తాను. అన్నివిధాలా ప్రయత్నిస్తాను. అప్పటికిగాని ఇక్కడ నుంచి కదలను. ఏమయినాసరే కదలను. ఎవరు నన్నిక్కడి నుంచి గెంటివేస్తారోచూస్తాను. ఎవరికిఅధికారముంది? ఎవరికి ధైర్యముంది? నిజానికి తను ఇంత నిరాశపడవలసిన అవసర మేముంది? అయినా ఆ ముసలమ్మమాటలకి తను అంతవిలువ ఎందుకివ్వాలి? ఎన్నడూ అబద్ధమాడి ఎరుగని శ్రీధర నీఇంటికి నువ్వురమ్మని పిలుస్తుంటే తనెందుకు వెనకాడాలి? లలిత అంత ఆప్యాయంగా ఆదరిస్తుంటే తను ఆమెని ఎందుకు దులుపు కుంటూ దూరంగా తిరగాలి? ఒకవేళ లలిత శ్రీధర హృద యాన్ని వశంచేసుకున్నా తను తిరిగి జయించాలి. ఈ ప్రయ త్నంలో తనప్రాణం పోయినాసరే. అంతకంటే తనకి కర్తవ్య మేముంది? ఇక్కడినుంచి పారిపోయి తను ఈ ప్రపంచంలో ఏంచెయ్యాలి? రాత్రంతా సరళకి నిద్రపట్టలేదు.

"అక్కా, నిద్రపట్టిందా బాగా" అని అడిగింది లలిత పొద్దున్నే. పట్టిందని సరళ అబద్ధమాడింది. లలితకి అసలు సంగతి తెలుసు. ఎందుకు పట్టలేదో కూడా సరిగ్గానే ఊహించ గలిగింది.

శ్రీధర లేవగానే ముఖం కడుక్కోటానికి చెంబూ, తువ్వాలూ, పళ్ళపొడీ ఎదురుగా పెట్టివున్నయ్. వెంటనే కాఫీ కూడా వచ్చింది. కాని తెచ్చింది లలితకాదు, సరళ. ఆనాడు పగలంతా శ్రీధర పక్కదగ్గర కూచుని ఉపచారాలుచేసింది లలితకాదు-సరళ. రాత్రి అతనికి షేక్స్పియర్ నాటకం చదివి వినిపించింది సరళ. సరళ పక్కనే కూచుని వింటూ లలిత లోలోపల పొంగిపోతోంది.

ఇదంతా శ్రీధరకి అద్భుతంగావుంది. ఇల్లా జరుగుతుందని కలలోనైనా అనుకోలేను.

రోజులు తిరిగిపోతున్నయ్. లలిత పగలంతా బడి పనిలో మునిగిపోతోంది. క్రమంగా శ్రీధర కోలుకొని బడికి వెళ్ళే ఓపిక వచ్చింది. "సరళా, రేవటినుంచీ బడికివెళ్తాను."

"అప్పుడేనా? ఇంకా బాగా ఓపిక రాలేదు." అని సరళ అడ్డుపెట్టింది. ఈసమాధానం విని శ్రీధర మరీ చకితుడై పోయాడు. కాని సరళ ఈమాదిరిగా ఎందుకు మారిపోయిందో తన్నుకున్నా అతనికి తెలియటంలేదు.

కొన్నాళ్ళు పోయాక శ్రీధర సరళని పరీక్షచేయటం కోసం "సరళా, నాకుఆపదసమయంలో వచ్చావు. కాపాడావు. ఇక నీకు ఇక్కడ ఉండటం సుఖంగా లేకపోతే మీ నాన్న

గారి ఊరు వెళ్ళిపోవచ్చు" అన్నాడు. వెంటనే సరళ అతన్ని మధ్యలోనే ఆపి "ఇక ఎన్నడూ ఆమాట రానివ్వనని ఒట్టు వెయ్యండి." అని కన్నీటితో అడిగింది. సూర్యుడు పడమట ఉదయించాడా అనిపించింది శ్రీధరకి.

ఆరోజు ఆశ పుట్టినరోజు. అందరి మనసులూ ఆనాడు ఆనందంతో నిండి తొణుకుతున్నయ్. భోజనాలయినాక లలిత శ్రీధరని అడిగింది—"బావా, ఇప్పుడు చెప్పు, పందెంలో ఎవరు గెలిచారో?" శ్రీధర నవ్వుతూ వెంటనే అన్నాడు—"నువ్వే గెలిచావు లలితా. ఎట్లాగైనా మీ ఆడవాళ్ళ మనసులు ఆడవాళ్ళకే తెలియాలిగాని మాకేం తెలుస్తయ్!" ఇన్నాళ్ళనుంచీ అడిగి తెలుసుకోవాలని తహతహలాడుతున్న సరళ ఆరాటం పట్టలేక అడిగింది- "ఏం పందెం లలితా? నాక్కూడా చెప్పవ్! ఎవరుగెలిచారో నేను చెపుతాను." అని. లలిత క్షణంసేపు ఊరుకుని శ్రీధరముఖం కేసి చూసి చివరికి నవ్వుతూ బదులు చెప్పింది. "ఏంలేదు అక్కా, ఒకనాడు బావకి జ్వరం బాగా తీవ్రంగా వుంది. ఆశని చూడాలని ఒకటే కలవరించాడు. అప్పుడు నేను 'బావా, అక్కనీ, ఆశనీ రమ్మని రాయనా' అని అడిగాను. 'వద్దు. నీచేతకాదు. మీ అక్క ఎన్నటికీరాదు, రప్పించటం నీతరంకాదు.' అని నిరాశతో అన్నాడు. అప్పుడు నేను రప్పిస్తానని పందెం వేశాను. ఎల్లా రప్పిస్తావన్నాడు. ఒక్క ఉత్తరంతో రప్పిస్తా నన్నాను. నీతరంకాదు చూద్దాంగా అన్నాను. అదీ మా పందెం. ఇప్పుడు నువ్వే చెప్పు అక్కా, ఎవరుగెలిచారో?"

సరళకూడా నవ్వింది. ఆ ఒక నవ్వుతో లోపలి బరు

వంతా ఎగిరిపోయింది. "అయితే, లలితా, నిజం చెప్పు. నువ్వేనా యేమిటి హితకారిణీదేవివి?" అని అడిగింది. లలిత నవ్వుతూ నేనేనని తలవూపింది. సరళకి పట్టలేని సిగ్గూ, చెప్ప లేని సంతోషమూ ఒక్కసారి వచ్చి "లలితా, నీమేలు జన్మ జన్మాలకీ మరిచిపోను" అంది. "అల్లా అనబోకు అక్కా. నేను చేసిందేముందీ?" అంటూ లలిత వెళ్ళిపోవటానికి లేచింది.

ఇంతసేపూ అమాయక ప్రేక్షకుడిగా వుండిపోయిన శ్రీధర లేచివచ్చి "నువ్వు చేసిన మేలు ఇంకెవరు చేస్తారు లలితా? మనుష్యుల సంగతి అటుంచి దేవతలుకూడా చేస్తారో లేదో చెప్పలేను." లలిత నిలబడిపోయి తలవంచుకుంది. శ్రీధర మళ్ళీ అందుకున్నాడు–"అయితే లలితా, మన ఆశకి అక్షరాభ్యాసం ఎప్పుడు?"

"ఇవాళే చేద్దాం. ఏం ఆశా, వస్తావా బళ్ళోకి?"

ఆశ వెంటనే లలితచంక ఎక్కి కూచుంది. "ఆశతో పాటు నన్నుకూడా నీబళ్ళో చేర్చుకుంటావా లలితా?" అని అడిగింది సరళ. లలిత నవ్వుతూ బదులు చెప్పకుండా ఊరు కుంది. "నవ్వులాటకాదు లలితా, నిజంగా నీదగ్గర మళ్ళీ ఓన మాలు దిద్దుకోవాలని వుంది. నన్ను నీ బళ్ళోకి రానివ్వక పోతే వీల్లేదు" అంది. శ్రీధర "ఇదిగో లలితా, కొత్తశిష్యులు వచ్చారనే సంతోషంలో ఈ పాతశిష్యుడి మాట మరిచిపోకు. తెలిసిందా?" అన్నాడు.

చెదిరిపోయిన మబ్బుల్లోంచి సూర్యుడు మిల మిల మెరుస్తూ కిలకిల నవ్వాడు.

—★—